దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747

వార్తాప్రభ
RNI No. APTEL/2004/12176
epaper : https://varthaprabha.com
సమగ్ర వార్తా దినపత్రిక
విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

SINCE: 1984
చైతన్య కాలేజ్
Cell: 93908 22625
ONE SITTING (For Discontinued)
B.Tech, M.Tech, Diploma
M.B.A, M.C.A, M.Sc, M.A.
B.A, B.Com, B.Sc, B.B.A,
U.G.C. Recog. Universities
10th & Inter TOSS / APOSS / NIOS
డైరెక్టర్: బి.వి. త్రినాథ్ M.A, M.Ed, M.Phil, L.L.B

| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 117 | ది. 8-8-2026 | శనివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 117 | Date : 8-8-2026 | Saturday | Pages : 8 | Rs.1/- |

# చట్టం చేస్తున్నాం...బీసీలకు సంరక్షణ కల్పిస్తాం

## 12వ జాతీయ చేనేత దినోత్సవంలో సీఎం చంద్రబాబు

- చేనేతలకు మేలు చేసేది... అండగా నిలిచేది కూటమి ప్రభుత్వమే
- ఆర్థిక కష్టాలున్నా సంక్షేమం-అభివృద్ధిలో రాజీపడడం లేదు
- కుటుంబానికి ఇల్లు... రాష్ట్రానికి రాజధాని అవసరం
- మాది బ్రాండ్ ఇమేజ్... వాళ్లది బ్యాడ్ ఇమేజ్
- జన్-జీ అభివృద్ధి కోరుకుంటోంది... జనరేషన్ గొడ్డలి కుట్రలు పన్నుతోంది
- 44 ఏళ్లు వస్తే వయసైపోయినట్టా...?
- చీరాలలో నేతన్న సేవలో పథకం ప్రారంభం
- కుటుంబానికి రూ.25 వేలు చొప్పున 71,536 కుటుంబాలకు రూ. 179 కోట్లు జమ చేసిన సీఎం చంద్రబాబు





**చీరాల,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** బీసీల సంరక్షణను చేపట్టే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని... దీనికోసం త్వరలోనే చట్టం చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. బీసీ సంరక్షణ చట్టం కోసం ముసాయిదా సిద్ధమైందని వెల్లడించారు. శుక్రవారం 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గంలోని కొత్తపేట గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నేతన్న సేవలో సంక్షేమ పథకాన్ని సీఎం ప్రారంభించారు. రాష్ట్రంలోని అర్హులైన చేనేత కుటుంబాలకు రూ. 25 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని సీఎం అందించారు. మొత్తంగా 71,536 చేనేత కుటుంబాలకు రూ.179 కోట్లను సీఎం చంద్రబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. అలాగే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నా... రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం-అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడడం లేదని ముఖ్యమంత్రి వెల్లడించారు. అలాగే రాష్ట్రంలో జరుగుతున్న ప్రగతిని అడ్డుకునేలా జరుగుతున్న కుట్రల పట్ల ప్రజలు అప్రమత్తతో ఉండాలని సూచించారు. ఇలాంటి వారి విషయంలో ప్రభుత్వం కఠినంగా ఉంటుందని... ప్రజలు కూడా కుట్రలు పన్నే వారి నైజాన్ని గమనించాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."స్వదేశీ ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకునేలా ఆగస్ట్ 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఇది మరపురాని రోజుగా ఉండాలనే నేతన్న సేవలో... పథకాన్ని ప్రారంభించాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాదు... చెప్పని వాటినీ అమలు చేస్తున్నామనడానికి నేతన్న సేవలో పథకమే నిదర్శనం. చేనేత కేవలం ఒక వృత్తే కాదు... భారతీయ సంస్కృతికి ప్రతీక. దేశం గర్వించే కళ చేనేత. మన రాష్ట్రం అనేక చేనేత కళలకు నిలయం. అలాంటి వర్గానికి ఆసరాగా ఉంటున్నాం. చీరాల, వెంకటగిరి, ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి, పొందూరు, పెడన, శ్రీకాళహస్తి, నరసాపురం... ఇలా రాష్ట్రంలో అనేక చేనేత ఉత్పత్తులు విశిష్ట గుర్తింపు పొందాయి. 1.27 లక్షల మంది చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. నేతన్న సేవ పథకమే కాదు... ఇప్పటికే నేతన్నలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ యూనిట్లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యూనిట్లకు ప్రయోజనం కలుగుతోంది. చేనేతలకు 50 ఏళ్లకే ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పెన్షన్ అందిస్తున్నాం. 85 వేల మంది చేనేతలకు ఫించన్‌గా రూ.4 వేల చొప్పున నెలకు రూ.35 కోట్లు ఇస్తున్నాం. రూ.420 కోట్లు ఏడాదికి ఖర్చు పెడుతున్నాం. రాష్ట్రంలోని 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ ద్వారా రూ.79 కోట్లు ఇచ్చాం. స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద రూ.10 కోట్ల వ్యయంతో 10 చేనేత క్లస్టర్లకు ఆమోదం పొందాయి. హ్యాండ్లూమ్ మార్కెటింగ్ అసిస్టెన్స్ కార్యక్రమంతో నేత కార్మికులకు నేరుగా మార్కెట్ అవకాశాలు వచ్చాయి. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదు-పాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు చేస్తున్నాం. అమరావతిలోని శాఖమూరులో చేనేత, హస్తకళల మ్యూజియం కూడా వస్తోంది. విశాఖపట్నంలో రూ.4,200 కోట్ల పెట్టుబడితో సుస్థిర టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు కానుంది."అని సీఎం చంద్రబాబు అన్నారు.

**బీసీలకు అండగా...** "బీసీలకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తోంది. వారి సంక్షేమం కోసం పని చేయడంతోపాటు... రక్షణ కల్పించేందుకు చట్టం చేస్తున్నాం. దీని కోసం ముసాయిదా ఇప్పటికే సిద్ధమైంది. ఇక బీసీల సంక్షేమంలో భాగంగా వివిధ వర్గాలను అన్ని రకాలుగా అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం. చేపల వేట నిషేధ సమయంలో 1.34 లక్షల మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున రెండేళ్లలో రూ.505 కోట్లు ఇచ్చాం. వడ్డెరలకు మైనింగ్ లీజులు, గీత కార్మికులకు ఎక్సైజ్ షాపులు కేటాయించాం. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు బీసీలకు 3 కిలో వాట్లకు అదనంగా రూ.20 వేలు సబ్సిడీ ఇస్తున్నాం. రాష్ట్రంలో అందరికీ రూ.2.5 లక్షల చొప్పున యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకువస్తున్నాం. అభివృద్ధితో పాటు సంక్షేమం, సుపరిపాలనను అందించేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. పేదలు భోజనానికి ఇబ్బందులు పడకుండా రూ.5 అన్నా క్యాంటీన్లో భోజనం అందిస్తున్నాం. కొందరు వ్యక్తులు

- 2లో

## దేశంలో కులగనణ జరిపి, రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేయాలి

- కులగనన జరిగితేనే దేశశీ శరవేగంగా అభివృద్ధి చెందుతుంది
- దేశవ్యాప్తంగా జరుగుతున్న బీసీ ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ బాసటగా ఉంటుంది
- కాంగ్రెస్ పార్టీ దేశంలో అధికారంలోకి రాగానే డిమాండ్లను పరిష్కరిస్తాం
- కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడి
- మా వాటా మాకు దక్కేవరకు కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు పోరాడుతాం
- ఏపీ నుండి యూపీ వరకు బీసీలను ఒకటి చేస్తాం
- చట్టసభలలో బీసీ రిజర్వేషన్ సాధించడమే బీసీ ఉద్యమ లక్ష్యంగా పనిచేస్తాం ---బీసీ ప్రముఖులు





**బెంగుళూరు,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** రాష్ట్రీయ ఓబిసి మహాసంఘ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నేడు బెంగళూరులోని సిటీ యూనివర్సిటీలో ఉన్న జ్ఞాన జ్యోతి ఆధ్వర్యంలో ఓబీసీ జాతీయ 11వ మహాసభ అత్యంత వైభవంగా జరిగింది, దేశం నలువైపులా నుండి వేలాదిమంది ఓబీసీ ప్రతినిధులు పాల్గొనగా, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కర్ణాటక పిసిసి చీఫ్ బీకే హరిప్రసాద్, తెలంగాణ నుండి వి హనుమంతరావు ఈటెల రాజేందర్ సిరికొండ మధుసూదనాచారి, మహారాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి అదుల్ సావే, కర్ణాటక డిప్యూటీ స్పీకర్ ఉమాశ్రీ, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజాప్రతినిధులు మహాదేవ్ జంకర్, పరిణయ ఓకే, అభిజిత్ వంజరి, సుధాకర్ అడబాలే, రేవన్న, సంకోజి సింగ్, మధు నాయక్ హాజరయ్యారు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహాసభకు రాష్ట్రీయ ఓబీసీ మహాసంగ్ అధ్యక్షులు ప్రొఫెసర్ పవన్ రావ్ తైవాడే అధ్యక్షత వహించగా, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు కేసిన శంకర్రావు సమన్వయం చేశారు జాతీయ ఓబీసీ మహాసభను కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ముందుగా మహనీయుల చిత్రపటాలకు పుష్పాంజలు ఘటించిన, జ్యోతి ప్రజ్వలన భావించి మహాసభను ప్రారంభించారు, ఈ సందర్భంగా కర్ణాటక సీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ మేం మానవత్వాన్ని నమ్ముతామణి, బసవేశ్వరుని జీవిత చరిత్ర తెలుసుకోవాలన్నారు కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలను కాపాడుతుందనీ ఇందిర గాంధీ హాయంలో బడుగు బలహీన వర్గాలకు భూములు పంపిణీ చేసిందనీ ఆయన గుర్తు చేశారు 12వ దశాబ్దంలో మొట్టమొదటి మైసూరు రాజు జైచంద్ర వేడియార్ కాలంలో నే రిజర్వేషన్లు కల్పించారన్నారు బీసీలు దేశం లో 55 శాతం ఉన్నారు బీసీలు మీ నైపుణ్యత తో దేశాన్ని నిర్మించారు ఇతర కులాలు బీసీలు చేసే పని చేయ లేరు బీసీలు జాతీ నిర్మాతలని సీఎం కొనియాడారూ 1931 కులగణన బ్రిటిష్ కాలంలో జరిగిందనీ మళ్లీ నేటి వం-కు దేశంలో జరగలేదని, కులగనన దేశవ్యాప్తంగా జరిగితేనే అన్ని రంగాల్లో దామాషా ప్రకారం బీసీలకు అవకాశాలు దక్కుతాయి అన్నారు ఇదే విషయాన్ని రాహుల్ గాంధీ చెప్పాడని ఆయన సందర్భంగా గుర్తు చేశారు ప్రతి రాష్ట్రంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి, బడ్జెట్ ఉన్నది మా ప్రభుత్వం లో 2/3 బీసీల ప్రాతినిధ్యం ఉన్నది కర్ణాటక రాష్ట్రంలోని సామాజిక, ఆర్థిక సర్వే ను చేశాము,దానిని అమలు చేస్తానన్నారు

## ప్రజల గుండెల్లో పొన్నమండ లక్ష్మణస్వామివర్మ

- అగ్నికుల క్షత్రియుల చరిత్రను చాటిచెప్పిన మహనీయుడు
- ఆయుర్వేదంతో వేలాది పేదలకు ఆరోగ్యాన్ని ప్రసాదించిన గొప్పవ్యక్తి
- రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



**విజయవాడ,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** ప్రజాసేవకు అంకితమైన జీవితంతో సేవా కార్యక్రమాల ద్వారా మన్ననలు పొందిన రాజశ్రీ పొన్నమండ లక్ష్మణస్వామివర్మ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అగ్నికుల క్షత్రియ జాతిపిత స్వర్గీయ పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో

- 2లో

## సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణకు దేశంలోనే ప్రథమ స్థానం

- జాతీయ ప్రగతి సమీక్షలో 9 కీలక మూల్యాంకన ప్రమాణాల్లో అగ్రస్థానం
- సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులను అభినందించిన డీజీపీ సీవీ ఆనంద్



**హైదరాబాద్,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** సైబర్ నేరాల నియంత్రణ, బాధితులకు న్యాయం, అత్యాధునిక సాంకేతికత వినియోగం, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి అంశాల్లో తెలంగాణ పోలీసు శాఖ మ-రోసారి దేశానికి ఆదర్శంగా నిలిచింది. ఈ సందర్భంగా రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ , సిపిలను, ఎస్పీలు తో పాటు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు, సిబ్బందిని అభినందించారు. ప్రధానమంత్రి కార్యాలయం ఆధ్వర్యంలో గురు వారం నిర్వహించిన జాతీయ ప్రగతి సమీక్షలో సమావేశంలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల సైబర్ నేరాల పనితీరును 9 కీలక మూల్యాంకన ప్రమాణాల ఆధారంగా పరిశీలించగా, తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానం సాధించింది. సైబర్ నేరాల నియంత్రణ కోసం స్టేట్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్

- 2లో

## జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి

- ఇళ్ళు , ఇళ్ళ స్థలాల కేటాయింపు , పెన్షన్ అమలు, వెల్ఫేర్ ఫండ్ పునరుద్ధరణ చేయాలి.
- జర్నలిస్టుల సంక్షేమమే అంతిమ లక్ష్యంగా ఏపిఎంపిఏ చేపట్టనున్న ఐఖ్య ఉద్యమానికి మిగిలిన యూనియన్ లు కలసి రావాలని పిలుపు.
- నవంబర్ 2 నుండి ఉద్యమం ఉద్ధృతం చేస్తాం.
- ఏపిఎంపిఏ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్



**మోపిదేవి/అవనిగడ్డ,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** ఎన్నో సవాళ్ళను అధిగమిస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా సేవలందిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.కృష్ణాజిల్లా మోపిదేవి లో వేంచేసియున్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకున్న అనంతరం స్థానిక మీడియా ప్రతినిధులతో కొద్దిసేపు ఇష్టాగోష్టి నిర్వహించారు.క్షేత్రస్థాయిలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సవాళ్ళను , సమస్యలను స్థానిక మీడియా ప్రతినిధులు ఆయన దృష్టికి తెచ్చారు.స్పందించిన ఆయన ఇష్టాగోష్టి అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు, 20ఏళ్ళ సర్వీస్ పూర్తి చేసిన వారికి కనీసం పదివేలకు తక్కువ కాకుండా పెన్షన్ మంజూరు , వెల్ఫేర్ ఫండ్ పునరుద్ధరణ తదితర సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని కోరారు.జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను బేషరతుగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.జర్నలిస్ట్ హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజీని రూ ఇరవై ఐదు లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు.దేశంలో పన్నెండు రాష్ట్రాలలో జర్నలిస్టు పెన్షన్ స్కీమ్ అమలవుతోందని దీనికి సంబంధించి ఆయా రాష్ట్రాల్లో ఉన్న ఉత్తర్వుల దస్త్రాలను పరిశీలన కోసం ఏపిఎంపిఏ యూనియన్ ప్రభుత్వ పెద్దలకు అందించి అమలుకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.కరోనా లాక్ డౌన్ సమయంలో నిలిపివేసిన రైల్వే పాసులను పునరుద్ధరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.రూ యాభై కోట్ల తో వెల్ఫేర్ ఫండ్ ఉండేదని దానికి కూటమి ప్రభుత్వం మరికొంత నిధులు మంజూరు చేసి వెల్ఫేర్ ఫండ్ పునరుద్ధరించాలని కోరారు. అనేక సమస్యలతో సతమతమవుతూ అభద్రతాభావంతో పనిచేస్తున్న జర్నలిస్టులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని కూటమిలో బాగస్వామ్య పక్షాలైన తెలుగుదేశం,జనసేన , బిజెపి పార్టీ అధినేతలకు శ్రీరామ్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.జర్నలిస్టు సమస్యల పరిష్కారం కోరుతూ ఇప్పటికే పలు దఫాలుగా రాష్ట్ర మంత్రులను ,సమాచార శాఖ ఉన్నతాధికారులను కలిసి విన్నవించినట్లు చెప్పారు.సమస్యల పరిష్కారంలో జాప్యానికి యూనియన్ లలో ఐక్యత లేకపోవడమే ప్రధాన కారణమని ఆవేదన వ్యక్తం చేశారు.జర్నలిస్టులకు ఇళ్ళు , ఇళ్ళ స్థలాల కేటాయింపు, పెన్షన్ అమలు, వెల్ఫేర్ ఫండ్ పునరుద్ధరణ తదితర సమస్యల పరిష్కారం కోసం ఐఖ్య ఉద్యమానికి ఏపిఎంపిఏ యూనియన్ కార్యాచరణ రూపొందిస్తుందని మిగిలిన యూనియన్ లు కలసి రావాలని పిలుపునిచ్చారు.యూనియన్ లలో అనైక్యత కారణంగా జర్నలిస్టులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.జర్నలిస్టుల సంక్షేమమే అంతిమ లక్ష్యంగా ఏపిఎంపిఏ చేపట్టనున్న ఐఖ్య ఉద్యమంలో మిగిలిన జర్నలిస్టు యూనియన్లు భాగస్వాములు కావాలని కోరారు.జర్నలిస్టుల సంక్షేమానికి,సమస్యల పరిష్కారానికి చేసే పోరాటంలో ఏపిఎంపిఏ ఎట్టిపరిస్థితుల్లోనూ వెనకడుగు వేయదని శ్రీరామ్ యాదవ్ స్పష్టం చేశారు.కలసి వచ్చే యూనియన్ లతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని , ప్రభుత్వం నుండి సానుకూల స్పందన లేకపోతే సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నవంబర్ రెండోవ తేదీ నుండి ప్రత్యక్ష ఆందోళనకు శ్రీకారం చుడతామని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ తేల్చి చెప్పారు .ఈ సమావేశంలో ఏపిఎంపిఏ గౌరవ సలహాదారు తలశిల నాగేశ్వరరావు,జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీధర్ , తాతినేని లీలాకృష్ణ,కార్యదర్శి కె.శ్రీనివాసరావు , సహాయ కార్యదర్శి ఉప్పల మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు, అవనిగడ్డ**

IP 9/2026

Between :

కోట నాగవేణు ------పిటిషనర్

మరియు

కోట నాగపోతురాజు మరియు ఇతరులు ------రెస్పాండెంట్స్

**నోటీసు టు :**

1) కోట వెంకట పోతురాజు S/o దయాదరరావు, R/o కోడూరు, కోడూరు మండలం
2) సనకా శ్రీరామ్ బాబు S/o రామచంద్రరావు, R/o కోడూరు, కోడూరు మండలం
3) మేడూరి హరిష్ S/o రామారావు, R/o ఇస్మాయిల్‌బేగ్‌పేట, H/o కోడూరు, కోడూరు మండలం
4) బావిశెట్టి నాంచారయ్య S/o లక్ష్మణ, R/o బావిశెట్టివారిపాలెం, కోడూరు మండలం
5) అడపా ప్రభాకరరావు S/o వెంకట శ్రీనివాసరావు, R/o రామచంద్రాపురం, కొత్తపేట, అవనిగడ్డ మండలం

పై నెంబరు పిటిషన్‌లో పిటిషినర్ అయిన కోట నాగవేణు పై వారిపై IP 9/2026 దాఖలు చేసియున్నారు. సదరు వాయిదా ది.20-08-2026న అయివున్నది. కావున IP 9/2026 లో రెస్పాండెంట్స్ అయిన మీరు మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), అవనిగడ్డ కోర్టు నందు ది.20-8-2026న ఉదయం 10.30 గం॥లకు మీరు స్వయంగా గానీ లేక మీ లాయరు గారి ద్వారా గానీ హాజరుకాగలరు. లేనియెడల పై రెస్పాండెంట్స్ అందరు Exparte గా కోర్టు వారు భావిస్తారు.

**ఇట్లు : తిమ్మన సుబ్బారావు, B.A., LLB.,**
అడ్వకేట్, అవనిగడ్డ, సెల్ : 8978311931

## పుట్రేల 146 బూత్ నూరు శాతం సక్సెస్

● టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు అరిగే శ్రీనివాసరావు



**పుట్రేల,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** కూటమి ప్రభుత్వం విజయవంతంగా 2000 ప్రజా పరిపాలన పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా నిర్వహిస్తున్న ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని పుట్రెల గ్రామం(146)లో నూటికి నూరు శాతం పూర్తి చేసినట్లు పుట్రేల గ్రామ పార్టీ అధ్యక్షులు అరిగే శ్రీనివాసరావు తెలియజేశారు. బూత్ కన్వీనర్ రామినేని ఏడుకొండలు కు పట్టు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మారెమ్మ దేవాలయం చైర్మన్ తెర్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు గాదె రమేష్ టిడిపి నాయకులు కార్యకర్తలు సానుభూతిపరులు పాల్గొన్నారు.

## పూడికతీత, కొత్త డ్రైన్లు, సిమెంట్ తూరాలు... కానుమోలులో అభివృద్ధి పనుల జోరు



**హనుమాన్ జంక్షన్,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు బాపులపాడు మండలం కానుమోలు గ్రామంలోని ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్య, మౌలిక వసతుల అభివృద్ధి పనులు నిన్నటి నుంచి ప్రారంభమైనట్లు కానుమోలు ఈవో సుభాష్ తెలిపారు. కాలనీలో ఉన్న కచ్చా డ్రైన్లలో పూడికతీత పనులు చేపట్టడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో కొత్త కచ్చా డ్రైన్లు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చోట్ల సిమెంట్ తూరాలు కూడా వేస్తున్నారు. వర్షాకాలంలో మురుగునీరు నిల్వ ఉండకుండా, పారిశుద్ధ్య వాతావరణం మెరుగుపడేలా ఈ పనులను వేగవంతంగా చేపట్టినట్లు ఈవో సుభాష్ తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచనల మేరకు గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. స్థానికులు ఈ చర్యలపై హర్షం వ్యక్తం చేస్తూ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు.

## ఆషాఢం ఆఖరి శుక్రవారం సందర్భంగా కనకదుర్గ అమ్మవారికి విశేష పూజలు



**మచిలీపట్నం,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా ఆధ్వర్యంలో రుస్తుంబాద కనకదుర్గ అమ్మ వారి ఆలయంలో ఆషాఢం ఆఖరి శుక్రవారం సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం దూళిపాల రాము ఆలయ పూజారి విశ్వ హిందూ పరిషత్ కార్యకర్తలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాలను పొందారు.

## డా.తురగా సూర్యారావుకు శోభిత వర్మ పురస్కారం..



**కాకినాడ,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** శోభిత వర్మ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు డా. చల్లగాలి శ్రీనివాస్ వర్మ సారథ్యంలో రాజ మహేంద్రవరం నెల నెలా కళాకారులకు సత్కారం శ్రీ జ్ఞాన సరస్వతి ఘాట్ లో జరిగినది.ముఖ్య అతిథిలుగా ఆర్యపురం కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ డా. చల్లా శంకరరావు తెలుగుదేశం పార్టీ నాయకులు నిమ్మలపూడి గోవిందు, ఆంధ్రా తేజం పత్రిక. ఎడిటర్ శ్రీనివాసరాజు తోట సుబ్బారావు పాల్గొన్నారు. పురస్కారం పొందినవారిలో కాకినాడ కు చెందిన డా.తురగా సూర్యారావును సత్కరించి మెమెంటో అందచేసినారు ఈకార్యక్రమంలో శ్రీనివాస్ వర్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. తురగా సూర్యారావును పోస్టల్ సిబ్బంది పెన్షనర్లు సత్కళావాహిని కమిటీ మెంబెర్స్ ఆర్టిస్ట్స్ అభినందనలు తెలుపుతూ మరిన్ని పురస్కారాలు పొందాలని ఆకాంక్షించారు.

## తాళ్లపాలెం సెక్టార్ లో ముగిసిన తల్లిపాల వారోత్సవాలు...

### -తాళ్లపాలెం లో తల్లుల ర్యాలీ



**మచిలీపట్నం,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం నాడు తాళ్లపాలెం బీచ్ ప్రాంతం లోని అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర శిశు అభివృద్ధి పథకం ఐసిడిఎస్ సూపర్వైజర్ బి కృష్ణకుమారి తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ముఖ్యంగా ముర్రుపాలు వల్ల పిల్లలకు కలిగే ప్రయోజనాలను కూడా తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కల్పన ఎం ఎస్ కె పెద్దింట్లమ్మ ఏ ఎన్ ఎం సుధారాణి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# చట్టం చేస్తున్నాం...బీసీలకు సంరక్షణ కల్పిస్తాం

## 12వ జాతీయ చేనేత దినోత్సవంలో సీఎం చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

దీనికీ అడ్డం పడి అన్నా క్యాంటీన్లను ఎత్తేశారు. విద్య అందరికీ అందాలన్న లక్ష్యంతో తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ.. వారి తల్లుల ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నాం. సంక్షేమంతో పాటు అభివృద్ధిపైనా శ్రద్ధ పెడుతున్నాం.

గత పాలనలో రోడ్లన్నీ గుంతలే. మన రాష్ట్రాన్ని చూసి ఎగతాళి చేశారు... ఇప్పుడు రోడ్లకు మరమ్మత్తులు చేశాం. పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించాం... రూ. 12 లక్షల కోట్ల మేర పెట్టుబడులు ఇప్పటికే గ్రౌండ్ అయ్యాయి. యువతకు ఉద్యోగాలు వచ్చేలా చేస్తున్నాం... అభివృద్ధి-ఉపాధి కల్పించేలా పారిశ్రామికాభివృద్ధి చేస్తున్నాం. రోడ్లు, పోర్టులు, విమానాశ్రయాలు కూడా రాష్ట్రంలో నిర్మించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం. గత పాలకుల నిర్వాకం వల్ల ఆర్ధిక ఇబ్బందులున్నా... గడచిన 2 ఏళ్లల్లో పేదలను ఆదుకునేందుకు రూ.1.50 లక్షల కోట్లు సంక్షేమం చేశాం. అభివృద్ధి కోసం 2 ఏళ్లల్లో రూ.1.34 లక్షల కోట్లు ఖర్చు చేశాం. రోడ్లు సహా ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నాం."అని ముఖ్యమంత్రి వివరించారు.

**కుటుంబానికి ఇల్లు... రాష్ట్రానికి రాజధాని..** "గత పాలనలో రాజధాని లేకుండా చేశారు... రాష్ట్రం పేరు చెబితే ఇతర ప్రాంతాల్లో చులకన అయ్యేలా చేశారు. అద్భుతమైన నగరం ఉండాలనే అమరావతిని నిర్మిస్తున్నాం. రాజధానిపై గత పాలకులు నాలుక మడతపెట్టారు. మూడు ముక్కలాట ఆడారు. రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. దేశంలో ఏ రాష్ట్రమైనా తమ రాజధాని నగరాలను ఘనంగా చెప్పుకుంటున్నాయి. గత పాలనలో రాజధానే లేకుండా పోయింది. కూటమి అధికారంలోకి వచ్చాక అమరావతి పనులు రీస్టార్ట్ చేశాం. ఆగస్టు 13 తేదీన రాజధానిలోని ప్రధాన రాజమార్గం సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభం అవుతుంది. వేగంగా జరుగుతున్న పనులు చూసి రాజధానిపై మళ్లీ కుట్రలు పన్నుతున్నారు. మావిగన్, వాటికన్ అంటూ ఏవోవో చెబుతున్నారు. మళ్లీ మూడు ముక్కలాట కావాలా...? రాజధానిని విధ్వంసం చేసుకుంటామా..? కుటుంబానికి ఇల్లు, రాష్ట్రానికి రాజధాని అవసరం. గత ప్రభుత్వం రాష్ట్ర పరువును తీసేసింది. ఇమేజ్ ను దారుణంగా దెబ్బతీసింది. కూటమి వచ్చాక మళ్లీ ఏపీ బ్రాండ్ ను పునరుద్ధరించాం. పెట్టుబడులు తీసుకువచ్చి పరిశ్రమల్ని ఏర్పాటు చేయిస్తున్నాం. వాళ్లది బ్యాడ్ ఇమేజ్... మాది బ్రాండ్ ఇమేజ్. కోర్టు కేసులు వేసి అడ్డుకున్నా మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉద్యోగాలు ఇచ్చాం. ఏడాదిన్నర తర్వాత ఇప్పుడు మళ్లీ పేపర్ లీక్ అంటూ కుట్ర రాజకీయాలు చేస్తున్నారు. కోర్టు చీవాట్లు పెట్టినా... మళ్లీ ధర్నాలు చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కల్పిస్తూ ప్రజలను వేధిస్తున్నారు. జెన్-జీ యువత అభివృద్ధిని కోరుకుంటోంది. కానీ కొందరు గొడ్డలి జనరేషన్ కు చెందిన వారు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. వీళ్లది గొడ్డలి జె. అభివృద్ధిని అడ్డుకునేలా చేసే అరాచకాలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించం. కఠిన చర్యలకు వెనుకాడం."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**కుట్రలను గమనించాలి... కుట్రదారులను దూరంపెట్టాలి..** "గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లను నేరాలు, ఘోరాలు చేసే వ్యక్తుల్ని ప్రోత్సహిస్తూ కొందరు అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారు. యాక్సిడెంట్ చేస్తే గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తీసుకెళ్లాలి... కానీ ఆధారాలు తారుమారు చేసేసి, వ్యక్తులను మార్చేసి కుట్రలు చేసి కేసు మాఫీ చేసేందుకు ప్రయత్నించారు. 44 ఏళ్ల వ్యక్తి చనిపోతే ఇబ్బందేమిటని మాట్లాడతారు. ఇదెక్కడి విడ్డూరం... ఇలాంటి వారిని ఏమనాలి..? పరామర్శల కోసం గంటల పాటు రోడ్లను నిర్బంధించి వెకిలి చేష్టలు చేస్తున్నారు. శాంతి భద్రతలను కాపాడే మహిళా పోలీసు అధికారుల విషయంలోనూ అసభ్యంగా ప్రవర్తించారు. మహిళా పోలీసుల అధికారులను కూడా గొడ్డలి గ్యాంగ్ వేధిస్తోంది. పొగాకు రైతులను పలకరించేందుకు వెళ్లి అక్కడ అరాచకం సృష్టించారు. రౌడీయిజం చేస్తూ రప్పా రప్పా అంటూ రోడ్డుపైకి వచ్చి అడ్డం పడుతున్నారు. బ్రాందీ షాపుల్లో మద్యం తాగి బట్టలు విప్పి అరాచకం సృష్టిస్తున్నారు. గంజాయి బ్యాచ్ అంతా పొగాకు నాశనం చేశారు. రైతులు అవేదన వారికి పట్టడం లేదు. ఓ దుకాణాన్ని కూడా ధ్వంసం చేశారు. ఓ వ్యక్తి వీళ్ల కుమ్ములాటలో గాయపడి ఆస్పత్రిలో చనిపోయారు. సభ్యతగా వ్యవహరించాల్సిన కొన్ని రాజకీయ పార్టీలు అసభ్యంగా, బాధ్యతా రాహిత్యంతో ప్రవర్తిస్తున్నాయి. గత పాలనలో అంతా అరాచకం రాజ్యం ఏలింది. ఇప్పుడు ప్రజలకు ఆ పరిస్థితి లేదు. కుట్రలను ప్రజలు గమనించాలి... కుట్రదారులను దూరం పెట్టాలి. ప్రజలు చైతన్యంతో వ్యవహరించాలి."అని సీఎం చంద్రబాబు కోరారు.

**మినీ ముంబై చీరాలకు పూర్వవైభవం తెస్తాం..** "చీరాల పేరు వింటేనే ఇక్కడి నేతన్నల నైపుణ్యం గుర్తుకు వస్తుంది. చీరాల పట్టు, కాటన్ చీరలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. చీరాల ఖర్చీఫ్లు ఒకప్పుడు విదేశాలకు భారీగా ఎగుమతి అయ్యేవి. చేనేత ఉత్పత్తుల్లో ఒకప్పుడు 'మినీ ముంబై'గా పేరొందిన చీరాలకు పూర్వ వైభవం తెస్తాం. పర్యాటకుల్ని ఆకట్టుకునేలా సూర్యలంక, బాపట్ల, చీరాల సముద్ర తీర ప్రాంతాలను తీర్చిదిద్దుతున్నాం. రూ. 97 కోట్ల స్వదేశ్ దర్శన్ నిధులతో సూర్యలంక నుంచి చీరాల వరకు పర్యాటక కారిడార్ ఏర్పాటు చేస్తున్నాం."అని ముఖ్యమంత్రి చెప్పారు. తన ప్రసంగం అనంతరం బాపట్ల జిల్లాలో వివిధ శాఖలకు చెందిన అధికారుల పని తీరుపై తన వద్దనున్న నివేదికను ప్రజలకు చదివి వినిపించారు.

# కనీస వేతనం 31వేలు కోరుతూ ఆగస్టు 10 జైల్ భరో కేంద్ర కార్మిక సంఘాల పిలుపు

● రైతు పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని డిమాండ్



**కాకినాడ, ఆగష్టు 7 (వార్తాప్రభ) :** కేంద్ర కార్మిక సంఘాలు, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మోడీ ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై ఆగస్టు 10 జైల్ భరో కార్యక్రమాన్ని అన్ని నియోజకవర్గాల్లోను, కాకినాడ మెయిన్ రోడ్డు హెడ్ పోస్టాఫీస్ వద్ద నిర్వహిస్తున్నట్లు కచేరిపేట సిఐటియు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పత్రికా సమావేశంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి గోడ పత్రికను అవిష్కరించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, ఐఎన్టియుసి రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ తాళ్లూరి రాజు, ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు వి చిట్టిబాబు, ఏఐటీయూసీ అధ్యక్షులు కెవి రామయ్య మాట్లాడుతూ ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా మోడీ ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీ పంటలకు గిట్టుబాటు ధర చట్టాన్ని తక్షణం చేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికునికైనా కనీస వేతనం నేటి ధరలకు అనుగుణంగా 31 వేలు చెల్లించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు దాని ఆధారంగా పంట రుణాలు, పంట నష్ట పరిహారం చెల్లించాలని, ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచి, పట్టణ ప్రాంతాల్లో అమలు చేయాలని, రోజు వేతనం 700 చెల్లించాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం 12 ఏళ్ల కాలంలో అనుసరించిన రైతాంగ వ్యతిరేక విధానాలకు 1.25 లక్షల మంది రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడ్డారని విమర్శించారు. ఆత్మహత్యకు పాల్పడిన ప్రతీ రైతు కుటుంబానికి 25 లక్షల పరిహారాన్ని కేంద్రం చెల్లించాలని కోరారు. పార్లమెంటులో మోడీ ప్రభుత్వం ఇచ్చిన గణాంకాల ప్రకారం ఏడేళ్ల కాలంలో ఐదు లక్షల చిన్న మధ్య తరహా పరిశ్రమలు మూతపడి లక్షలాది మంది కార్మికులకు ఉన్న ఉపాధి పోయిందన్నారు. 29 కార్మిక చర్యలను రద్దుచేసి 4 లేబర్ కోడ్లు యాజమాన్యాలకు అనుకూలంగా తెచ్చి కార్మికులకు ఉన్న కనీస హక్కులను రద్దుచేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్లో 90 శాతం వ్యవసాయం చేసే కవులు రైతులకు ఎటువంటి పంట రుణాలు గాని, నష్టపరిహారం గాని అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాది హామీ పథకంలో ఆర్థిక భారాన్ని 40 శాతం రాష్ట్రాలపై మోపుతూ బిజెపి ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని వ్యతిరేకించాలన్నారు. దురదృష్టవశాత్తు రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించడం మానేసి అన్యాయం చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలలో పని చేసే స్కీం వర్కర్లు, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు మినిమం టైమ్ స్కెల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి మలకా రమణ, వర్కింగ్ కమిటీ సభ్యుడు పలివెల వీరబాబు, టి రాజా, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

## నాటి వైసిపి ప్రభుత్వ కాలనీలలో మౌలిక వసతులతో ఇల్లు నిర్మించి ఇవ్వాలి

### -సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ డిమాండ్





**విస్సన్నపేట,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** స్థానిక సుందరయ్య భవనం లో సిపిఎం విస్సన్నపేట టౌన్ కార్యదర్శి మేకల జ్ఞానరత్నం అధ్యక్షతన మంగళవారం జగనన్న కాలనీ స్థలాల లబ్ధిదారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ హాజరయ్యారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో అర్హులైన పేదలకు ప్రభుత్వం సెంటున్నర స్థలం కేటాయించిందని కానీ తిరువూరు నియోజకవర్గంలో నాలుగు మండలాలలో ఎక్కడ జగనన్న కాలనీ పేరుతో ఇచ్చిన స్థలంలో ఇల్లు నిర్మించలేదని ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పేదలకు సొంత ఇంటి కలల సహకారం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 99 పైసలు ఎకరం భూమి పెట్టుబడిదారులకు 99 సంవత్సరాల లీజుకి ఇవ్వడం జరిగింది. పేదలకు సెంటున్నర స్థలంలో ఇల్లు కట్టి ఇవ్వటానికి ముందుకు ఎందుకు రావడం లేదు అని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం పేదల పక్షాన ఓట్లు పొంది పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తుందని ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా వెంటనే పేదలకు ఇచ్చిన స్థలాల్లో ఇల్లు నిర్మించి ఇవ్వాలని కాలనీలలో కనీస మౌనిక వసతులు అయిన సౌకర్యాలు వీధిలైట్లు మంచినీళ్లు సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాలనీ ఇల్లు నిర్మించి ఇచ్చేంతవరకు సిపిఎం లబ్ధిదారుల పక్షాన పోరాడుతుందని విస్సన్నపేట సిపిఎం మండల కార్యదర్శి వి నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం విస్సన్నపేట మండలం కమిటీ సభ్యులు వినుకొండ రంగా రాణి, ఆడిమిల్లి కిషోర్, గద్దల రామకృష్ణ లబ్ధిదారులు పాల్గొన్నారు. దళిత బస్టాండ్ సెంటర్ నుండి మండల రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తాసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఉదయం ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లేనరీ సమావేశాలకు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వికాస్, శ్రీసిద్ధార్థ, శ్రీశ్రీ, కె.వి.ఆర్, కేఎంఆర్ అంటే ఎం ఎస్ ఆర్ గవర్నమెంట్ జూనియర్ కళాశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## అమ్మవారు పవన్ కళ్యాణ్ కు సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించాలి

● అక్కల రామ్మోహన్రావు (గాంధీ) ● అమ్మవారికి ఆషాడం సారె సమర్పించిన జనసేన వీరమహిళలు



**ఇబ్రహీంపట్నం,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** కనకదుర్గమ్మ తన చల్లని చూపు అందరిపై ఉంచాలని తల్లిని వేడుకున్నట్లు తెలిపారు మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ అక్కల రామ్మోహన్రావు (గాంధీ). జనసేన పార్టీ జిల్లా వీర మహిళా విభాగం ఆధ్వర్యంలో సమస్త జీవకోటిని ఎల్లవేళలా కాచి కాపాడే తల్లి అమ్మలగన్న అమ్మ శ్రీ బెజవాడ కనకదుర్గ అమ్మవారికి ఆషాడ సారెను సమర్పించారు. ఈ సందర్భంగా గాంధి మాట్లాడుతు కనకదుర్గమ్మ చల్లని ఆశీస్సులు అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ పై ఉండాలని,వారు మంచి ఆరోగ్యం,దీర్ఘాయుష్షు తో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని, అలాగే రాష్ట్రం,దేశం సుభిక్షంగాఉండాలని ,అమ్మవారి దివ్య ఆశీస్సులతో రైతులు, మహిళలు,యువత అభివృద్ధి చెందాలని, అమ్మవారిని కోరుకుంటూ వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున జనసేన పార్టీ నాయకులు,వీర మహిళలు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణకు దేశంలోనే ప్రథమ స్థానం

(మొదటిపేజీ తరువాయి)

సెంటర్ (S4C) కింద ప్రత్యేక తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ను ఏర్పాటు చేసిన దేశంలో తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. రూ.5 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ విలువైన సైబర్ మోసాల కేసుల్లో 49 ఈ-జీరో ఎఫ్ఐఆర్లు నమోదు చేస్తుంది. సైబర్ నేరాల ఫిర్యాదుల పరిష్కారంలో 88 శాతం, బాధితుల డబ్బు తిరిగి పొందే ప్రక్రియలో 81 శాతం పనితీరు నమోదు చేసింది. 'సహయోగ్' పోర్టల్ ద్వారా అభ్యంతరకర, నేరాలకు సంబంధించిన ఆన్లైన్ కంటెంట్ తొలగింపులో 88 శాతం పని తీరుతో మెరుగైన ఫలితాలను నమోదు చేసింది. అంతర్రాష్ట్ర సమన్వయంలో 97 శాతం జ×గూ= అభ్యర్థనలను పూర్తి చేయడంతో పాటు, 79 శాతం రాష్ట్రాల మధ్య అభ్యర్థనలను పరిష్కరించింది. అలాగే 5,500 మంది నేరస్థుల ప్రొఫైళు అప్లోడ్ చేయగా, 15 వేల అంతర్రాష్ట్ర నేర లింకులను గుర్తించింది. మరో వైపు సైబర్ నేరాల కట్టడికి పోలీసు సిబ్బంది లో సామర్థ్య పెంపు కోసం 524 మంది అధికారులకు సైట్రెయిన్ (జుమీథుఱఅ) పోర్టల్ ద్వారా శిక్షణా సదుపాయాలు కల్పించింది. దేశవ్యాప్తంగా గుర్తించిన 15 తీవ్రమైన సైబర్ హాట్స్పాట్ రాష్ట్రాల జాబితాలో తెలంగాణ లేకపోవడం రాష్ట్ర సైబర్ నేరాల నియంత్రణ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోంది. పోలీసులు ప్రజల్లో సైబర్ భద్రతపై విస్తృత అవగాహన కల్పించేందుకు చేపట్టిన కార్యక్రమాల ద్వారా 8.5 లక్షల మందికి పైగా చేరుకోగా, డిజిటల్ అరెస్ట్ మోసాలపై మరో 2 లక్షల మందికి ప్రత్యేక అవగాహన కల్పించింది. సైబర్ నేరాల నియంత్రణలో దేశస్థాయిలో తెలంగాణ మరోసారి ప్రథమ స్థానం సాధించడం తెలంగాణ పోలీసు శాఖ సమిష్టి కృషికి నిదర్శనమని అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా అత్యాధునిక సాంకేతికత వినియోగంలో తెలంగాణ పోలీసు దేశానికే ఆదర్శంగా నిలవాలని, ఇదే స్థాయి పనితీరును కొనసాగిస్తూ తెలంగాణ పోలీసు గౌరవాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

## ప్రజల గుండెల్లో పొన్నమండ లక్ష్మణస్వామివర్మ

● అగ్నికుల క్షత్రియుల చరిత్రను చాటిచెప్పిన మహనీయుడు ● ఆయుయుర్వేదంతో వేలాది పేదలకు ఆరోగ్యాన్ని ప్రసాదించిన గొప్పవ్యక్తి ● రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

(మొదటిపేజీ తరువాయి)

జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర.. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతా గోపీచంద్, అగ్నికుల క్షత్రియ, బీసీ సంఘాల నాయకులు తదితరులతో కలిసి పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పొన్నమండ లక్ష్మణస్వామివర్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని పేర్కొన్నారు. అగ్నికుల క్షత్రియుల చరిత్రను భావితరాలకు చాటిచెప్పిన మహనీయుడు లక్ష్మణ స్వామి వర్మ అని.. ఆయన ఆయుర్వేదంతో వేలాది మంది పేదలకు ఆరోగ్యాన్ని ప్రసాదించారని పేర్కొన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులిచ్చిన గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, గౌరవ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. నాటి సమాజంలో ప్రజల సమస్యల్ని చూసి.. చలించిపోయి వారికి పొన్నమండ లక్ష్మణస్వామివర్మ అండగా నిలిచారన్నారు. పేదల కోసం కోరంగిలో ఉచిత వైద్యశాల ఏర్పాటు చేశారని.. అగ్నికుల క్షత్రియుల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా పత్రికను నడిపించారన్నారు. అగ్నికుల క్షత్రియులను సమాజంలో చిన్నచూపు చూడటాన్ని సహించలేక చరిత్రను అధ్యయనం చేశారని.. అనేక ప్రాంతాల్లో తిరిగి శోధించి బ్రిటిష్ ప్రభుత్వానికి ఆధారాలు చూపించి అగ్నికుల క్షత్రియులుగా గుర్తింపు తీసుకొచ్చారన్నారు. ఇందుకు అనేక సంవత్సరాల పాటు పోరాడి ప్రత్యేకంగా జీవో వచ్చేలా చేసిన కృషి లక్ష్మణస్వామి వర్మగారి చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా అందరి ఆదరాభిమానాలను సొంతం చేసుకున్న పొన్నమండ లక్ష్మణస్వామివర్మ వంటి మహనీయుల అడుగుజాడల్లో నడిచే అవకాశం లభించడం తన అదృష్టమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ మహనీయుల త్యాగాలు, సేవలను స్మరించుకోవడంతో పాటు, వారు చూపిన స్ఫూర్తిదాయకమైన మార్గంలో నడవడం ద్వారా సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహనీయుల ఆశయాలను భావితరాలకు అందించడమే వారికి మనం అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరాం ప్రసాద్, సగర కార్పొరేషన్ డైరెక్టర్ తాడిశెట్టి వీరస్వామి, బీసీ సంఘ నాయకులు సంగేపు రంగారావు తదితరులతో పాటు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇ.జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు వెంటనే సాగునీరు ఇవ్వాలంటూ వైసీపీ రిలే దీక్ష





**పెడన,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** పెడన పట్టణంలో ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో నియోజకవర్గం ఇంచార్జ్ ఉప్పాల రాము జడ్పీ చైర్మన్ హారిక ఆధ్వర్యంలో రెండవ రోజుగా స్థానిక పట్టణం బస్టాండ్ ఎదురుగా శుక్రవారం రిలే నిరాహార దీక్ష కార్యక్రమం ఏర్పాటు చేసారు ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా జడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక వైసీపీ జిల్లా అధికారప్రతినిధి గరికపాటి రామానాయుడు ఎంపీపీ రాజులపాటి వాణి అచ్యుతరావుకటకం ప్రసాద్ దావు భైరవలింగం కొండవీటి నాగబాబు బళ్ళ గంగయ్య బండారు మల్లి బండారు ఆనందప్రసాద్ ఖాజా గరికపాటి చారుమతి వన్నం శ్రీలత రహేతున్నీసా రౌతుల ప్రసాద్ జయేష్ గుడిసేవ శ్రీనివాసరావు లోయ ఆంజనేయులు రైతులు ప్రముఖ రైతులు జన్ను నాగమల్లేశ్వరావు వన్నెంరెడ్డి మహంకాళరావు మాదాసు బాబురావు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# ఆల్‌పార్టీ సమావేశంలో ఓటు హక్కు నమోదుపై బీఆర్ఎస్ నాయకుడు కుంట సిద్దిరాములు పిలుపు

● పార్టీలకు అతీతంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో పాలుపంచుకోవాలని విజప్తి

● ఓటు హక్కు సవరణ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరడమైనది



**జీడిమెట్ల,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** జీడిమెట్ల మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్వహించిన సర్వపక్ష (ఆల్‌పార్టీ) సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కుంట సిద్దిరాములు పాల్గొన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై అధికారులతో, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన విస్తృతంగా చర్చించారు. రాజకీయాభిప్రాయాలకు, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్క అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ), బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏ) కలిసి పనిచేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కుంట సిద్దిరాములు మాట్లాడుతూ.. 10-08-2016 తర్వాత వివిధ కారణాల వల్ల ఓటు హక్కు లభించని వారికి, ఓటరు జాబితాలో పేర్లు తొలగించబడిన వారికి ఎన్నికల కమిషన్ మళ్లీ ఓటు హక్కు పొందేందుకు సువర్ణావకాశం కల్పించిందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకునేలా ప్రతి బీఎల్ఏ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజాసేవ దృక్పథంతో పనిచేయాలని సూచించారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు దక్కేలా చూడటం మనందరి ప్రాథమిక కర్తవ్యమని పేర్కొన్నారు. ఓటు హక్కు నమోదు, సవరణల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఎన్నికల అధికారులు, బీఎల్ఓలు మరియు క్షేత్రస్థాయిలో సేవలు అందిస్తున్న అన్ని పార్టీల బీఎల్ఏలకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేసి అర్హులందరినీ ఓటరు జాబితాలో చేర్పించాలని కోరారు.

# మహిళల సాధికారతకు ఎన్టీపీసీ చేయూత!!

● సీఎస్ఆర్‌తో బ్యూటీషియన్ కోర్సు ప్రారంభం ● మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రోత్సాహం ● డీఎంఎస్ ఆధ్వర్యంలో శిక్షణ ప్రారంభం



**పెద్దపల్లి/గోదావరిఖని,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** ఎన్టీపీసీ రామగుండం తన కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా మహిళల ఆర్థిక సాధికారతకు మరో ముందడుగు వేసింది. పరిసర గ్రామాలకు చెందిన మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతో మూడు నెలల బ్యూటీషియన్ శిక్షణా కోర్సును శుక్రవారం ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని డీఎంఎస్ అధ్యక్షురాలు రాఖీ సమంత ప్రారంభించగా, డీఎంఎస్ సీనియర్ సభ్యులు పాల్గొన్నారు. మహిళల్లో స్వయం ఉపాధి సామర్థ్యాన్ని పెంపొందించేందుకు అవసరమైన ప్రాథమిక బ్యూటీషియన్ నైపుణ్యాలను ఈ శిక్షణలో అందించనున్నారు. ఈ సందర్భంగా దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు మాట్లాడుతూ, మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు నైపుణ్యాభివృద్ధి ఎంతో అవసరమన్నారు. ఎన్టీపీసీ సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా అందిస్తున్న ఈ బ్యూటీషియన్ శిక్షణ మహిళలకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని తెలిపారు. శిక్షణను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని స్వంత గుర్తింపుతో ముందుకు రావాలని మహిళలకు సూచించారు. మహిళల సాధికారతే కుటుంబం, సమాజం అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని ఆమె తెలిపారు. ఎన్టీపీసీ నిరంతరం సీఎస్ఆర్ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్యం, జీవనోపాధి రంగాల్లో సంస్థ చేపడుతున్న చర్యలు గ్రామీణాభివృద్ధికి తోడ్పడుతున్నాయని వివరించారు. మహిళా సాధికారతతో పాటు స్థిరమైన సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఈ బ్యూటీషియన్ కోర్సు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# బైక్ సైలెన్సర్లపై ఎస్సై హరి శేఖర్ ఉక్కుపాదం!!

● చట్టాన్ని ధిక్కరిస్తే ఉపేక్ష లేదని ఘాటు హెచ్చరిక ● శబ్ద కాలుష్యంపై స్పెషల్ ఫోకస్ ● 20 బైక్‌ల పట్టివేత...మోడిఫైడ్ సైలెన్సర్ల తొలగింపు ● శబ్దం చేస్తే కేసులే...కటకటాలు లెక్కపెట్టుడే అని హెచ్చరికలు



**పెద్దపల్లి/గోదావరిఖని, ఆగష్టు 7 (వార్తాప్రభ) :** రామగుండం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న మార్పులు చేసిన బైక్ సైలెన్సర్లపై ఎస్సై హరి శేఖర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఎల్బీనగర్, తిలక్‌నగర్, రమేష్‌నగర్, అడ్డగుంటపల్లి, జవహర్‌నగర్ ప్రాంతాల్లో పోలీసు సిబ్బందితో కలిసి విస్తృత స్థాయిలో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగించే మోడిఫైడ్ సైలెన్సర్లతో తిరుగుతున్న వాహనాలను గుర్తించి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 20కి పైగా ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని నిబంధనలకు విరుద్ధంగా అమర్చిన సైలెన్సర్లను తొలగించారు. రోడ్లపై అనవసరంగా పెద్ద శబ్దాలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హరి శేఖర్ స్పష్టం చేశారు. యువత వినోదం పేరుతో చట్టాలను ఉల్లంఘిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. శబ్ద కాలుష్యం కూడా ఒక సామాజిక సమస్యేనని, ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలిగించే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలను సీజ్ చేయడానికీ వెనుకాడబోమని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, వాహనాల్లో అనధికారిక మార్పులు చేయడం చట్టవిరుద్ధమని గుర్తుచేశారు. ఇకపై ఇలాంటి స్పెషల్ డ్రైవ్‌లు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు అతిక్రమించే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు కూడా శబ్ద కాలుష్యాన్ని ప్రోత్సహించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సురక్షితమైన, ప్రశాంతమైన సమాజ నిర్మాణంలో పోలీసులకు సహకరించాలని ఎస్సై హరి శేఖర్ విజ్ఞప్తి చేశారు.

# డిగ్రీ కళాశాలలో అట్టహాసంగా బోనాల సందడి!!

● గోరింటాకు వేడుకలు ఘనంగా ● తెలంగాణ సంస్కృతికి పెద్దపీట ● సంప్రదాయ దుస్తుల్లో అలరించిన విద్యార్థినులు ● మహిళా సాధికారతపై లెక్చరర్ల అవగాహన ● ఆత్మవిశ్వాసమే మహిళా బలం కావాలని ఆకాంక్ష




**పెద్దపల్లి/గోదావరిఖని, ఆగష్టు 7 (వార్తాప్రభ) :** గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం బోనాలు, గోరింటాకు సంబరాలను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను కళాశాల ప్రాంగణంలో ప్రత్యేకంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ జై కిషన్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బోనాల పండుగ ప్రాశస్త్యం, తెలంగాణ ప్రజల జీవన విధానంలో దాని ప్రత్యేకతను విద్యార్థినులకు వివరించారు. అనంతరం నిర్వహించిన గోరింటాకు కార్యక్రమం సందడిగా సాగింది. విద్యార్థినులు ఉత్సాహంగా గోరింటాకు పెట్టుకుంటూ వేడుకల్లో ఆనందాన్ని పంచుకున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొనడంతో కళాశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా మహిళా సాధికారత విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ జి. శారద మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మన సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. మహిళల్లో ఆత్మవిశ్వాసం, ఐక్యతతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే ఉమెన్ ఎంపవర్మెంట్ ప్రధాన ఉద్దేశమని వివరించారు. మహిళల ప్రతిభను వెలికితీసేందుకు కళాశాలలో విభిన్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బోనాలు, గోరింటాకు వేడుకల ద్వారా విద్యార్థినుల్లో సాంస్కృతిక స్పృహతో పాటు స్నేహభావం పెంపొందిందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులు, సిబ్బందికి పులిహోర, బెల్లం అన్నం వితరణ చేశారు. సంప్రదాయ వంటకాలతో వేడుకల్లో ఆత్మీయత మరింత పెరిగింది. విద్యార్థినుల ఉత్సాహం, అధ్యాపకుల భాగస్వామ్యంతో కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆనందోత్సాహాల నడుమ బోనాలు, గోరింటాకు సంబరాలు విజయవంతంగా ముగిశాయి.

# బంటుమిల్లి మండలం రైతన్న మీకోసం కార్యక్రమం....

**కృత్తివెన్ను,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** బంటుమిల్లి నాగేశ్వరరావు పేట గ్రామాలలో రైతన్న మీకోసం ఎల్ నీనో ప్రభావం నివారణ కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమం అనే సమగ్ర క్షేత్ర స్థాయి ప్రత్యేక ప్రచార కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్.ఎస్.కె పరిధిలోని ప్రతి వ్యవసాయ భూకమతంను సందర్శించుట. పంట ప్రస్తుత పరిస్థితిని అంచనా వేయడం. క్షేత్ర స్థాయిలో గుర్తించిన పరిస్థితులకు తగువిధంగా పరిష్కార చర్యలు సూచించడం. సాగు చేపట్టని పొలాల్లో స్వల్పకాలిక ప్రత్యామ్యాయ పంటలు వేసే విధంగ ప్రోత్సహించడం పురోగతిని ఎ.పి.ఎ.ఐ.ఎం.ఎస్ 2.0 ద్వారా పర్యవేక్షిీచడం. పి.ఎం.డి.ఎస్ క్షేత్ర సందర్శన మరియు ప్రకృతి వ్యవసాయంను ప్రోత్సహించడం. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్.రమాదేవి,మండల వ్యవసాయ అధికారి నూరున్నీసా,వ్యవసాయ సహాయకులు కోటేశ్వరరావు,సరిత మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు..




# ఉద్యోగం కోసం ఎదురుచూపులు..!!

● న్యాయం కోసం నిరవధిక దీక్ష ● సింగరేణి బాధితుల కన్నీటి గోడు

● ఆర్జీ--1 జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన




**పెద్దపల్లి/గోదావరిఖని, ఆగష్టు 7 (వార్తాప్రభ) :** సింగరేణి అంటే వేలాది కుటుంబాలకు కేవలం ఒక సంస్థ కాదు.. వారి బతుకులకు ఆధారం, భవిష్యత్తుకు భరోసా. అలాంటి సింగరేణిలో తమ సమస్యలు పరిష్కారం కాక ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న బాధితులు ఇక ఓపిక నశించి పోరుబాట పట్టారు. మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసులను తక్షణమే పరిష్కరించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పదకొండు ఏరియా కోల్‌బెల్ట్ ప్రాంతానికి చెందిన బాధితులు ఆర్జీ--1 జీఎం కార్యాలయం ఎదుట శుక్రవారం నిరవధిక నిరసన దీక్షకు దిగారు. కుటుంబాన్ని పోషించాల్సిన చేతులు నేడు న్యాయం కోసం దీక్షలో కూర్చోవాల్సిన పరిస్థితి వచ్చిందంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సరాలు గడుస్తున్నా సమస్యలకు పరిష్కారం దొరకక, అధికారుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయామని కన్నీటి పర్యంతమయ్యారు. తమ జీవితాలను కమిటీల పేరుతో మరింత కాలం వేచి చూడాల్సిన పరిస్థితిలోకి నెట్టవద్దని వేడుకున్నారు. దీక్షకు ముందు బాధితులు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దీక్షా శిబిరంలో కూర్చొని తమ హక్కుల కోసం నిరసన చేపట్టారు. మొదటి రోజు దీక్షకు వివిధ కార్మిక, ప్రజా సంఘాల నాయకులు హాజరై బాధితులకు సంఘీభావం ప్రకటించారు. తమ కుటుంబాల్లో ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు, భార్యా పిల్లల కన్నీళ్లను ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం చూడాలని బాధితులు కోరారు. సమస్యలను పరిష్కరించేందుకు కమిటీలు ఏర్పాటు చేసి కాలయాపన చేయడం వల్ల తమ జీవితాల్లో కోల్పోయిన సంవత్సరాలు తిరిగి రావని అన్నారు. ఇకనైనా ఫైళ్లను పక్కన పెట్టకుండా ప్రతి కేసును పరిశీలించి న్యాయబద్ధమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగం తమకు దానం కాదని.. తమ కుటుంబాల భవిష్యత్తుతో ముడిపడిన న్యాయమైన హక్కు అని స్పష్టం చేశారు. తమ గోడు వినే వరకు దీక్షను కొనసాగిస్తామని బాధితులు తేల్చిచెప్పారు. లక్కా శ్రావణ్, పార్తపల్లి హరీష్ యాదవ్, ఉస్మాన్, మోత్కూరి రవికుమార్, ఆవుల రవి తదితర బాధితులు, వారి కుటుంబ సభ్యులు దీక్షలో పాల్గొన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కుటుంబాలకు ఇకనైనా ఊరట కల్పించాలని వారు కోరుతున్నారు. సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసులపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్ణయం కోసం ఎదురు చూస్తున్న ప్రతి కుటుంబంలోనూ ఆశ చిగురించాలంటే ఇక ఆలస్యం చేయకూడదని అన్నారు. తమ కన్నీటికి పరిష్కారం.. తమ పోరాటానికి న్యాయం లభించే వరకు వెనక్కి తగ్గేది లేదని బాధితులు స్పష్టం చేశారు.

# తల్లిపాలే శిశువుకు తొలి వరం

- ఆరోగ్యవంతమైన భావితరానికి బలమైన పునాది: డా. జి. రవి ప్రభు




**తిరుపతి,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా ఎస్వీ వైద్య కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వైద్య విద్య సంచాలకులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవి ప్రభు తల్లిపాల ప్రాధాన్యంపై విస్తృతంగా వివరించారు. తల్లిపాలే ప్రతి శిశువుకు ప్రకృతి ప్రసాదించిన తొలి వం-మని, ఆరోగ్యవంతమైన భావితర నిర్మాణానికి అవే బలమైన పునాదని ఆయన పేర్కొన్నారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంపొందించి, తల్లి--బిడ్డల మధ్య ప్రేమానుబంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. ఆధునిక జీవనశైలి, ఉద్యోగ ఒత్తిడి, అపోహలు, వాణిజ్య ప్రకటనల ప్రభావంతో కొందరు తల్లులు ప్రత్యామ్నాయ పాలపొడులపై ఆధారపడుతున్నారని, అయితే అత్యవసర వైద్య పరిస్థితులు మినహా ప్రతి తల్లి తన బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. ఉద్యోగినులకు ప్రసూతి సెలవులు, కార్యాలయాల్లో తల్లిపాలు సేకరించి భద్రపరిచే సౌకర్యాలు, శిశు సంరక్షణ కేంద్రాల ఏర్పాటు వంటి చర్యలు తల్లిపాల ప్రోత్సాహానికి ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు ఈ అంశంపై మరింత దృష్టి సారించాలని కోరారు. రుయా ఆసుపత్రి అదనపు వైద్య విద్య సంచాలకులు, సూపరింటెండెంట్ డాక్టర్ బి. మనోహర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ముర్రుపాలు పనికిరావని, స్వల్ప అనారోగ్యం ఉన్నప్పుడు తల్లిపాలు ఇవ్వకూడదనే అపోహలకు శాస్త్రీయ ఆధారాలు లేవని స్పష్టం చేశారు. ప్రజల్లో ఇంకా కొనసాగుతున్న ఇటువంటి అపోహలను విస్తృత ప్రచారం ద్వారా తొలగించాలని సూచించారు. చిన్నపిల్లల విభాగ ప్రొఫెసర్ డాక్టర్ అంజన్ కుమార్ మాట్లాడుతూ తల్లిపాలు అందిస్తున్న తల్లులను విజేతలుగా గుర్తించి సత్కరించి బహుమతులు అందజేసినట్లు తెలిపారు. అలాగే వైద్య, నర్సింగ్, ఫార్మసీ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, నాటికలు తదితర పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైద్య అధ్యాపకులు, వైద్యులు, పీజీ, యూజీ విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది, తల్లులు, ఎస్వీ వైద్య కళాశాల పీఆర్వో వీర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్బీ నగర్ కూల్చివేతలపై బీజేపీ స్పందన!!

● అక్రమ కబ్జాలకు కలెక్టర్ చెక్ పెట్టాలి ● బాధితులకే రూములు కేటాయించాలి ● ప్రభుత్వ స్థలాల కబ్జాలకు అడ్డుకట్ట వేయాలి ● అక్రమార్కులపై నిష్పక్షపాత చర్యలు తీసుకోవాలి ● కాలయాపన చేస్తే బీజేపీ పోరాటం ఉధృతం చేస్తాం ● కందుల సంధ్యారాణి



**పెద్దపల్లి/గోదావరిఖని,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** ఎల్బీ నగర్‌లో వార్తా కథనాలతో మున్సిపల్ యంత్రాంగం నిద్రమత్తు వదిలి అక్రమ నిర్మాణాలపై జేసీబీలతో విరుచుకుపడటాన్ని బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి తీవ్ర స్థాయిలో స్వాగతించారు. ఈ సందర్భంగా ఆమె ఘాటుగా స్పందిస్తూ, కేవలం ఎల్బీ నగర్‌లోని పిల్లర్ల కూల్చివేతతో అధికారుల బాధ్యత తీరిపోలేదని, రామగుండం నగరంలో సాగుతున్న అక్రమ కబ్జాల పర్వానికి కలెక్టర్ వెంటనే ముగింపు పలకాలంటూ ప్రత్యర్థి వర్గాలకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. తిలక్ నగర్, ఓల్డ్ అశోక్ నగర్, జూనియర్ కాలేజీ పరిసర ప్రాంతాల్లో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌లలో సైతం 'బాధితుల' పేరిట పెద్ద ఎత్తున మాఫియా చక్రం తిప్పుతోందని ఆరోపించిన ఆమె, రోడ్డు విస్తరణలో నిజంగా సర్వస్వం కోల్పోయిన పేదలకు మాత్రమే ఆ రూములను కేటాయించాలని స్పష్టం చేశారు. బాధితుల సెంటిమెంట్‌ను అమ్ముకుని, ధనార్జనే ధ్యేయంగా అక్రమాలకు తెగబడుతూ గదుల మాయాజాలం నడుపుతున్న అక్రమ లబ్ధిదారులను పక్కాగా గుర్తించి, వారి నిర్మాణాలను కూడా కనికరం లేకుండా నేలమట్టం చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. కళ్ళముందే కబ్జాలు జరుగుతున్నా అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ చూసీచూడనట్లు వ్యవహరిస్తే ఊరుకునేది లేదని, అధికారులు ఇప్పటికైనా నిష్పక్షపాతంగా స్పందించి అక్రమార్కుల గుట్టు రట్టు చేయాలని హెచ్చరించారు. ఒకవేళ ప్రజాధనాన్ని, ప్రభుత్వ స్థలాలను దోచుకుంటున్న కేటుగాళ్లకు కొమ్ముకాస్తూ కాలయాపన చేస్తే మాత్రం ఊరుకునే ప్రసక్తే లేదని, నగరంలోని నిజమైన బాధితులను, అసలైన లబ్ధిదారులను కలుపుకుని బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో అధికార యంత్రాంగానికి నిద్రలేకుండా పెద్ద ఎత్తున పోరాటాన్ని ఉధృతం చేస్తామని కందుల సంధ్యారాణి తీవ్ర స్థాయిలో హెచ్చరించారు.

# ఘన వ్యర్థాల నిర్వహణలో ఇక రాజీ లేదు..

● సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్--2026 అమలుకు కలెక్టర్ డీకే బాలాజీ కఠిన హెచ్చరిక.

● బల్క్ వేస్ట్ జనరేటర్లు సొంత ప్రాంగణాల్లోనే వ్యర్థాల ప్రాసెసింగ్ తప్పనిసరి.

● ఆగస్టు 10న వి.ఆర్. సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు.



**మచిలీపట్నం,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అమల్లోకి వచ్చిన సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్--2026 అమలులో ఎలాంటి రాజీ ఉండదని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ స్పష్టం చేశారు. అధిక మొత్తంలో ఘన వ్యర్థాలను ఉత్పత్తి చేసే బల్క్ వేస్ట్ జనరేటర్లు తమ సొంత ప్రాంగణాల్లోనే శాస్త్రీయ పద్ధతుల్లో వ్యర్థాలను ప్రాసెస్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ నిబంధనలపై పూర్తి అవగాహన కల్పించేందుకు ఈ నెల 10వ తేదీ సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు విజయవాడ కానూరులోని వి.ఆర్. సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించే ప్రత్యేక అవగాహన సదస్సుకు సంబంధిత సంస్థల ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని పిలుపునిచ్చారు. గురువారం రాత్రి కలెక్టరేట్లోని తన ఛాంబర్ నుంచి విడుదల చేసిన వీడియో సందేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఘన వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా అమలు చేయాలనే ఉద్దేశంతో సుప్రీంకోర్టు కఠిన మార్గదర్శకాలు జారీ చేసిందని, వాటి అమలుకు జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక అధికారాలు కల్పించిందని తెలిపారు. హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, అపార్ట్‌మెంట్లు, పరిశ్రమలు తదితర అధిక పరిమాణంలో ఘన వ్యర్థాలు ఉత్పత్తి చేసే సంస్థలు ఇకపై మున్సిపాలిటీలు లేదా గ్రామపంచాయతీలపై ఆధారపడకుండా తమ ప్రాంగణాల్లోనే వ్యర్థాలను శాస్త్రీయంగా ప్రాసెస్ చేసుకోవాలని సూచించారు. ఈ నిబంధనలను ప్రతి బల్క్ వేస్ట్ జనరేటర్ తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం, అమలు విధానం, అందుబాటులో ఉన్న పరిష్కారాలపై నిపుణులు ఆగస్టు 10న జరిగే సదస్సులో సమగ్రంగా వివరించనున్నారని తెలిపారు. అందువల్ల అన్ని బల్క్ వేస్ట్ జనరేటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా నిబంధనలను అమలు చేయని పక్షంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లా యంత్రాంగం చేపడుతున్న చర్యలను సుప్రీంకోర్టుకు అఫిడవిట్ రూపంలో సమర్పించాల్సిన బాధ్యత ఉన్నందున ప్రతి సంస్థ నిబంధనలను అత్యంత బాధ్యతతో అమలు చేయాలని సూచించారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన కృష్ణా జిల్లాను నిర్మించేందుకు ప్రతి సంస్థ భాగస్వామ్యం కావాలని, తమ ప్రాంగణాల్లోనే ఘన వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విజ్ఞప్తి చేశారు.

## ఎల్ నినో ప్రభావం పై రైతులకు అవగాహన



**చేజర్ల,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చడానికి రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం 'రైతన్న మీకోసం' అనే ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందని టీడీపీ మండల అధ్యక్షులు సిరాజుద్దీన్ తెలిపారు.మండలంలోని అన్నీ రైతు సేవా కేంద్రాల పరిధిలో శుక్రవారం రైతన్న మీకోసం కార్యక్రమం జరిగింది.చేజర్ల రైతు సేవ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎల్‌నినో కారణంగా వర్షపాతం తగ్గుదల వల్ల పంటలకు నీటి ఎద్దడికి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం చిరు ధాన్యాల పంటలు సాగు చేయాలని రైతులకు తెలియజేసారు. మండల వ్యవసాయ అధికారి హిమబిందు మాట్లాడుతూ ఏపీఎయిమ్స్ యాప్‌లో ఎరువుల కొనుగోలు విధానంతో పాటు యాప్ డౌన్‌లోడ్ శాస్త్రీయ సిఫారసుల మేరకు ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు.వరి పంటలో నల్లి నివారణకు ప్రోఫినోపాస్ మందు ఎకరానికి 400 మిల్లీలీటర్లు ఓబిరాన్ మందు ఎకరానికి 100 మిల్లీలీటర్లు ప్రొఫారగైట్ ఎకరానికి 300 మిల్లీలీటర్లు పిచికారి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చేజర్ల కోపరేటివ్ సొసైటీ అధ్యక్షులు వీరరాఘవరెడ్డి టిడిపి సీనియర్ నాయకులు రావి పెంచలరెడ్డి చేజర్ల వివఎ మేఘన తదితరులు పాల్గొన్నారు.

## రైతులందరూ ప్రధానమంత్రి ఫసల్ బీమాను సద్వినియోగం చేసుకోవాలి వ్యవసాయ అధికారులు..



**కృత్తివెన్ను,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** రైతన్న మీకోసం ఎల్ నినో ప్రభావ నిర్వహణ ప్రణాళిక కార్యక్రమం చిన పాండ్రాక ఎండపల్లి నీలిపూడి కృత్తివెన్ను లక్ష్మీపురం చినగొల్లపాలెం రైతు సేవా కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు సకాలంలో కురవక పంటకు సాగునీరుకు కొరత ఏర్పడుతుందని ప్రతి రైతు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఆగస్టు 15లోగా చెల్లించుకోవాలని వరి పంట వేయని రైతులకు పి.ఎం.డి.ఎస్ పంట వేయాలని సీడ్ పాలటైజేషన్ గురించి రైతులకు వివరించడం వ్యవసాయ అధికారులు వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మరియు అనుబంధ శాఖలు కలిసి నిర్వహించారు...

## బొమ్మిన నారాయణ చారిటబుల్ ట్రస్ట్ వారి రెండో విడత దోమల స్ప్రే



**రెడ్డిగూడెం,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** రెడ్డిగూడెం మండలం లో బొమ్మిన నారాయణ చారిటబుల్ ట్రస్ట్ మరియు ప్రభుత్వ వైద్యుల ఆధ్వర్యంలో రెండో విడత దోమల మందు స్ప్రే కార్యక్రమం మొదలైంది.ఈ కార్యక్రమం ఐదు రోజులు 13 పంచాయతీల్లో జరుగుతుంది దీనికి రెడ్డిగూడెం మండల ప్రభుత్వ వైద్యాధికారులు సహకరించటం జరుగుతుందని వారికి బొమ్మిన నారాయణ చారిటబుల్ ట్రస్ట్ తరపున ట్రస్ట్ చైర్మన్ బొమ్మిన కోటేశ్వరరావు ( రెడ్డిగూడెం మండల తెలుగుదేశం పార్టీ యువ నాయకులు)కృతజ్ఞతలు తెలిపారు.

## బిడ్డకు 6 నెలలు పాటు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలి



**పెనుగంచిప్రోలు,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండలం లోని అనిగండ్లపాడు గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా తల్లులకు శుక్రవారం మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగినది, తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించడం జరిగినది 6 నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని ఏడవ నెల నుండి కొంచెం ఆహారం ఇస్తూ తల్లిపాలు కొనసాగించాలని, అమ్మ పాలు అమృతం లాంటివని తెలియజేయడం జరిగినది. తల్లిపాల యొక్క ప్రాముఖ్యతను తల్లులకు వివరించడం జరిగినది ముర్రుపాల ప్రాముఖ్యతను కూడా వివరించడం జరిగినది ముర్రుపాలు 6 ప్రాణాంతక రోగాల నుంచి బిడ్డను కాపాడుతాయని తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు,ఆశ వర్కర్లు,పిల్లలు, తల్లులు, ఆయాలు పాల్గొన్నారు..

## డీఎస్సీ లీకేజీపై సీబీఐ విచారణకు భయమెందుకు?: జగన్

**విజయవాడ,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** డీఎస్సీ-2025 ప్రశ్నాపత్రం లీకేజీ, నియామకాల్లో అక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్న నిరుద్యోగ యువతపై ప్రభుత్వం దాడులకు పాల్పడుతోందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కుమారుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కాపాడేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వాన్ని ఇంతగా దిగజార్చుతున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు జగన్ ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ కోరుతూ విజయవాడలో శాంతియుతంగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న వారిపై అధికార పార్టీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు దాడి చేసి, శిబిరాన్ని ధ్వంసం చేశారని జగన్ ఆరోపించారు. పోలీసుల కళ్లెదుటే ఈ దౌర్జన్యం జరిగిందని, టెంట్లు పీకేసి మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహా నిరుద్యోగులపై రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేశారని పేర్కొన్నారు. మహిళలని కూడా చూడకుండా దాడులకు తెగబడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు శాస్త్రీయ సాగు పద్ధతులను అనుసరించాలి -ఎంఏవో కె.సిహెచ్.సూరిబాబు

**రైతన్న మీకోసం - ఎల్ నినో ప్రభావ నివారణ కార్యాచరణ ప్రణాళిక ప్రక్రియ ప్రారంభం**





**జి.కొండూరు,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** వర్షాభావ పరిస్థితులను సమర్థవం తంగా ఎదుర్కొనేందుకు శాస్త్రీయ సాగు పద్ధతు లను అనుసరించాలని మండల వ్యవసాయ అధికారి కె.సిహెచ్.సూరిబాబు రైతులకు సూచించారు.జి.కొండూరు మండల పార్టీ అధ్యక్షులు వేములకొండ వెంకటేశ్వరరావు, తెలుగు రైతు మైలవరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అంకెం సురేష్,జి.కొండూరు పీఏసీఎస్ చైర్ పర్సన్ పజ్జూరు శ్రీనివాసరావు,స్థానిక రైతుల తో కలిసి శుక్రవారం వ్యవసాయ అధికారి సూరిబాబు రైతన్న మీకోసం-ఎల్ నినో ప్రభావ నివారణ కార్యాచరణ ప్రణాళిక ప్రక్రియను ప్రారంభించారు. చి కొండూరు పిఎసిఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఏవో మాట్లాడుతూ ఈ కార్యక్రమం మండల వ్యాప్తం గా అన్ని రైతు సేవా కేంద్రాలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల అనగా ఆగస్టు 7, 2026 వ తేదీన రైతన్న మీకోసం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ రంగాల శాఖలు, మరియు వాటర్ యూజర్ అసోసియేషన్ ప్రెసిడెంట్లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు ప్రోగ్రెసివ్ ఫార్మర్స్ తో కలిసి ప్రతి రైతు కుటుంబాన్ని మరియు ప్రతి రైతు కమతాన్ని సందర్శించి ఖరీఫ్ సీజన్ మొత్తంలో పంట ఆరోగ్య పరిస్థితిని గమనించి రైతులకు తగు సలహాలు సూచనలు ఇవ్వటం జరుగుతుందని వెల్లడించారు.వర్షపు నీటి సంరక్షణ, నీటి పొదుపు పద్ధతులు, మట్టి పరీక్షలు, పంటల మార్పిడి, సూక్ష్మ సాగునీటి వినియోగం, వాతావరణ హెచ్చరికల ఆధారంగా వ్యవసాయ నిర్వహణ, పంటల ఆరోగ్య పర్యవేక్షణ, ఞూూ×మీా--2.0 మరియు ాా్వీణూ సేవల వినియోగంపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వుయ్యూరు చంద్రశేఖర్, గ్రామ రైతులు, ఏపీ సీఎన్‌ఎఫ్ సిబ్బంది,వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్ట్





**జవహర్ నగర్,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** పాత కక్షల నేపథ్యంలో ఒక వ్యక్తిపై ఇనుప రాడ్‌తో దాడి చేసి చంపేందుకు ప్రయత్నించిన కేసులో ముగ్గురు నిందితులను జవహర్ నగర్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జవహర్ నగర్ ఏసిపి చక్రపాణి, సర్కిల్ ఇన్స్పెక్టర్ సైదులు, ఎస్ఐ రాము, తెలిపిన వివరాల ప్రకారం బాధితుడు ఎం.సుధీర్ కుమార్ (28), గార్డెనర్‌గా పనిచేస్తూ యాప్రాల్‌లోని భగత్ సింగ్ నగర్‌లో నివాసముంటున్నాడు. నిందితుడు సందీప్ కుమార్ అలియాస్ కుట్టన్‌తో సుధీర్ కుమార్‌కు గతంలో వివాదాలు ఉన్నాయి. ఈ నెల 06వ తేదీన మధ్యాహ్నం 12:00 గంటల సమయంలో సుధీర్ కుమార్ తన సోదరుడు దీపక్‌తో కలిసి యాప్రాల్‌లోని ఆదిత్య వైన్స్ వద్ద ఉన్నాడు. ఆ విషయాన్ని నిందితుడు సందీప్ కుమార్ స్నేహితులైన ఎస్. వివేక్, వి. సుమిత్ రాఘవన్ గమనించి సందీప్‌కు సమాచారం అందించారు. వెంటనే సందీప్ కుమార్ ఇనుప రాడ్‌తో అక్కడికి చేరుకుని, సుధీర్ కుమార్‌ను చంపాలనే ఉద్దేశంతో అతని తలపై పదేపదే కొట్టి తీవ్రంగా గాయపరిచాడు. ఈ నేరంలో మిగతా ఇద్దరు కూడా అతనికి సహకరించారు.

**దర్యాప్తు నిందితుల అరెస్ట్:** తీవ్రంగా గాయపడిన సుధీర్ కుమార్‌ను సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా, జవహర్ నగర్ పోలీసులు ఆస్పత్రిలో అతని వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఆర్ . నెం . 1127/2026, యూ /సెక్షన్ 109(1) ఆర్ /డబ్ల్యూ 3(5) బీ ఎన్ ఎస్ కింద కేసు నమోదు చేసి, సబ్-ఇన్స్పెక్టర్ బి. రాము దర్యాప్తు చేపట్టారు. నిందితులు పరారవుతుండగా ఆగస్టు 06/07 రాత్రి యాప్రాల్ ఎక్స్ రోడ్స్ వద్ద జవహర్ నగర్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు తమ నేరాన్ని అంగీకరించారు. నిందితుల సమాచారం మేరకు సంఘటనా స్థలం పక్కన దాచిపెట్టిన 30 అంగుళాల పొడవున్న ఇనుప రాడ్‌ను కేసు ఆధారంగా సిసిటివి ఫుటేజ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**అరెస్ట్ అయిన నిందితుల వివరాలు:** ఏ -1: సందీప్ కుమార్ అలియాస్ కుట్టన్ (27), వృత్తి: డ్రైవర్, నివాసం: యాప్రాల్ ఏ -2: ఎస్. వివేక్ (38), వృత్తి: వెల్డింగ్ వ్యాపారం, నివాసం: యాప్రాల్ ఏ -3: వి. సుమిత్ రాఘవన్ (26), వృత్తి: టాటూ వ్యాపారం, నివాసం: యాప్రాల్ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో జవహర్ నగర్ సీఐ ఎస్. సైదులు, ఎస్ఐ బి. రాము వారి సిబ్బంది సమర్థవంతంగా వ్యవహరించి నిందితులను అరెస్ట్ చేసినట్లు జవహర్ నగర్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ చక్రపాణి తెలిపారు.

# సంగం లో ఘనంగా చేనేత దినోత్సవం

**సంగం,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** సంగంలోని చౌడమ్మ ఆలయం వద్ద జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేత కార్మికులు ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి అభినందనలు తెలుపుతూ ఎన్టీఆర్ పీఎం మోడీ సీఎం చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.చేనేత బంధువు ప్రగడ కోటయ్య జన్మదినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా గుర్తించి ప్రకటించడం పట్ల చేనేత కార్మికులందరూ హర్షం వ్యక్తం చేశారు.గతంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న చేనేత కార్మికులు అనుబంధ వృత్తుల వారికి కూటమి ప్రభుత్వం రూ.25 వేల ఆర్థిక సాయం అందించేందుకు శ్రీకారం చుట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని వేలాది చేనేత కుటుంబాలకు కష్టకాలంలో అండగా నిలుస్తుందని అన్నారు.చేనేత కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఆప్కో ద్వారా చేనేత వస్త్రాల విక్రయాలను ప్రోత్సహిస్తూ అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మికుల్లో పండుగ వాతావరణం నెలకొందని అన్నారు.చేనేత రంగానికి ప్రోత్సాహం అందిస్తున్న కూటమి



ప్రభుత్వానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అలాగే స్థానిక మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులు మాఘం గిరిబాబు, దండే పెంచలయ్య,కుండా సుబ్బారావు మోహన్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రైతన్న మీకోసం కార్యక్రమం పై అవగాహన సదస్సు

-మండల వ్యవసాయ అధికారి ఎం శ్రీధర్



**కోడూరు,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** కోడూరు మండల పరిధిలోని పలు సచివాలయాల వద్ద నాడు రైతన్న మీకోసం కార్యక్రమము పై అవగాహన సదస్సు కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి ఎం శ్రీధర్ నిర్వహించారు.ఈ కార్యక్రమములో భాగంగా ఎల్ నినో మరియు వర్షాభావ పరిస్థితులను, మరియు పంటల సస్య రక్షణ గురించి మరియు ఎరువుల వాడకం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు మరియు ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన పంటల భీమాకు నమోదుకు చివరి తేదీ 15.08.2026 వరకు అని, అవకాశం ఉన్నంతవరకు రైతులు తమ పంట నమోదును వెంటనే నమోదు చేసుకోవాల్సిందిగా తెలిపారు. ఈ కార్యక్రమములో గ్రామ వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ మార్కెటింగ్ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, నీటి సంఘాల సభ్యులు మరియు రైతులు పాల్గొన్నారు.


## శ్రీ తిరుపతమ్మ సన్నిధి జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియా



**పెనుగంచిప్రోలు, ఆగష్టు 7 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామంలో శుక్రవారం పాతసినిమా హాల్ సెంటర్ లోఉన్న ఆర్ కె పంక్షన్ హాల్ లో జరిగిన ప్రజా సమస్యలు పై నియోజకవర్గం స్థాయి లో నిర్వహించిన ప్రజా వేదిక ఎన్ టీ ఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మి శ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. దానిలో భాగం గా హాజరైన జాయింట్ కలెక్టర్ ఇలక్కియా అనంతరం పెనుగంచిప్రోలు లో వెంచేసిన శ్రీ తిరుపతమ్మ అమ్మ వారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ముందుగా ఆలయ అధికారులు మేళతాలాలు మంగళవాద్యాలతో స్వాగతం పలికారు,అమ్మ వారి సన్నిధిలో ఆలయ ప్రధాన పూజారులు, వేద పండితులు వేద మంత్రాలు చదివి దీవించి ఆశీర్వదిశీ చారు, మన సంప్రదాయం ప్రకారం చీర జాక్కెట్, పసుపు కుంకుమ పూల తో మహిళతో ఆమె వడి నింపారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఇలక్కియా మాట్లాడుతూ అమ్మ వారిని దర్శనం చేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు..

## శ్రీ తిరుపతమ్మ దేవస్థానం చైర్మన్ గా రమేష్ బాబు నియామకం

**ఘనంగా సన్మానించిన 1979 -80 టెన్త్ బ్యాచ్ మిత్రులు**



**పెనుగంచిప్రోలు,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం చైర్మన్ గా నియమించబడిన రమేష్ బాబు ని గురువారం 1979-1980 విద్యాసంవత్సరానికి చెందిన 10వ తరగతి మిత్రుల ఆధ్వర్యంలో ఈరోజు అభినందన సన్మాన కార్యక్రమం నిర్వహించారు,చిన్ననాటి నుంచి కలిసి చదువుకున్న మిత్రుడు ఉన్నతమైన పదవిని అధ రోహించడం తమందరికీ గర్వకారణమని టెన్త్ బ్యాచ్ మిత్రులు అన్నారు,ఈ సందర్భంగా రమేష్బాబు ని పూల గుచ్చాలు తో శాలువా లు కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు,తన మిత్రులు అందించిన ఈ అపూర్వ సన్మానం జీవితంలో మరవలేనిదని చైర్మన్ రమేష్ బాబు తెలిపారు, అమ్మవారి ఆశీస్సులతో పాటు మిత్రుల సహకారంతో దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు,ఈ కార్యక్రమం లో పరిమి ప్రసాద్,పద్మవతి దంపతులు, తుమ్మల భాస్కరరావు,బోళ్ల రవికుమార్ మండల ప్రెస్ క్లబ్ కార్యదర్శి తునికిపాటి శ్రీనివాసరావు,వంగవీటి శ్రీనివాసరావు,ముండ్లపాటి ప్రేమ్ కుమార్ విశ్రాంతీ ఎస్ ఐ (గన్నవరం )తదితరులు పాల్గొన్నారు.

# పుట్టగొడుగుల సాగుతో మహిళలు, యువత విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

● జిల్లా యంత్రాంగం నుంచి అన్ని విధాలా మద్దతు అందిస్తాం.జిల్లా కలెక్టర్ డీకే బాలాజి.



**ఘంటసాల: అవనిగడ్డ,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** వ్యవసాయానికి అనుబంధంగా అధిక ఆదాయాన్ని అందించే పుట్టగొడుగుల సాగును స్వయం ఉపాధి అవకాశంగా మలుచుకొని మహిళలు, యువత విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి పిలుపునిచ్చారు. కృష్ణా జిల్లా ఉద్యాన శాఖ, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సంయుక్త ఆధ్వర్యంలో, రేసిలియంట్ అగ్రి టెక్ ఫార్మ్స్ సహకారంతో మహిళలు, యువతకు నిర్వహించిన మూడు రోజుల పుట్టగొడుగుల పెంపకంపై రైతు శిక్షణ కార్యక్రమం శుక్రవారం ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో విజయవంతంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ నమ్రత అగర్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో కొత్త తరహా ఉపాధి అవకాశాలను సృష్టించాలనే లక్ష్యంతో "స్పిరిటెడ్ ఆంట్రప్రెన్యూర్స్ ప్రోగ్రామ్" ప్రారంభించామని తెలిపారు. వ్యాపార ఆలోచనలు ఉన్న యువతను గుర్తించి వారికి ఆర్థిక, సాంకేతిక, మార్కెటింగ్ పరమైన సహకారం అందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. తొలుత 150 మందితో ప్రారంభించాలని భావించినప్పటికీ జిల్లాలో 700 మందికి పైగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను గుర్తించగలిగామని చెప్పారు. వారికి మార్కెట్ అవకాశాలు కల్పించేందుకు బయ్యర్-సెల్లర్ మీట్లు నిర్వహించామని, వాటి ద్వారా రేసిలియంట్ అగ్రి టెక్ ఫార్మ్స్ వంటి సంస్థలతో అనుసంధానం ఏర్పడిందన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ఉత్పత్తి చేసే మిల్క్ మష్రూమ్‌లను కొనుగోలు చేసేందుకు సంస్థ ముందుకు రావడం ఈ కార్యక్రమానికి మరింత బలాన్ని చేకూర్చిందన్నారు. యూనిట్ స్థాపనకు అవసరమైన వ్యయానికి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. చిన్న స్థాయిలో పుట్టగొడుగుల సాగు ప్రారంభించిన మహిళా పారిశ్రామికవేత్త ప్రసన్న ప్రభుత్వ ప్రోత్సాహం, రుణ సహాయంతో తన యూనిట్‌ను విస్తరించి విజయవంతంగా అభివృద్ధి చేసుకున్నారని పేర్కొంటూ, అలాంటి విజయగాథలు మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. వ్యాపారంలో విజయం సాధించాలంటే కష్టపడి పనిచేయడం, కొత్తగా ఆలోచించడం, ఎదురయ్యే ఇబ్బందులకు వెనుకడుగు వేయకుండా పట్టుదలతో ముందుకు సాగడం ఎంతో ముఖ్యమని కలెక్టర్ సూచించారు. ప్రారంభ దశలో మార్కెట్‌ను సాధించడం కొంత కష్టమైనప్పటికీ, నాణ్యతను కాపాడుతూ నిరంతర ప్రయత్నం చేస్తే అవకాశాలు వాటంతట అవే వస్తాయని చెప్పారు. వరి వంటి సంప్రదాయ పంటలతో ఆశించిన ఆదాయం లభించని ప్రస్తుత పరిస్థితుల్లో పుట్టగొడుగుల సాగు అదనపు ఆదాయానికి మంచి అవకాశమని పేర్కొన్నారు. శిక్షణ పొందిన 60 మంది మహిళలు, యువత భవిష్యత్తులో విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షిస్తూ, ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం నుంచి అవసరమైన అన్ని విధాల మద్దతు అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో తొలి రోజు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పుట్టగొడుగుల పెంపకానికి సంబంధించిన శాస్త్రీయ, సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. రెండో రోజు పామర్రులోని రేసిలియంట్ అగ్రి టెక్ ఫార్మ్స్ యూనిట్‌లో ప్రత్యక్ష శిక్షణ నిర్వహించి పుట్టగొడుగుల ఉత్పత్తి, నిర్వహణ పద్ధతులను వివరించారు. మూడో రోజు నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో శిక్షణ అనంతరం చేపట్టాల్సిన కార్యాచరణ, స్వయం ఉపాధి అవకాశాలు, మార్కెటింగ్ వ్యూహాలపై మార్గనిర్దేశం చేసి, శిక్షణ పూర్తిచేసిన మహిళలు, యువతకు నైపుణ్య ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ డైరెక్టర్ కోఆర్డినేటర్ డాక్టర్ డి. సుధారాణి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జె. జ్యోతి, డీఆర్‌డీఏ పీడీ వై. హరిహరనాథ్, సస్యరక్షణ విభాగం ఎస్ఎంఎస్ డా. కె. రేవతి, రేసిలియంట్ అగ్రి టెక్ ఫార్మ్స్ వ్యవస్థాపకులు ఆర్.వి.ఎల్. మనోహర్, డి. సుధ, ఉద్యానవన శాఖ అధికారులు, ఏపీఎంలు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.

# నూజివీడు నియోజవర్గానికి దక్కిన అరుదైన గౌరవం

● రాపర్ల మురళీ కృష్ణకు హృదయ పూర్వక శుభాకాంక్షలు రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధసారథి



**నూజివీడు/ఏలూరు,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** నూజివీడు నియోజకవర్గం ముసునూరు మండలం కాట్రేనిపాడు గ్రామానికి చెందిన రాపర్ల మురళీకృష్ణ కు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన బాధ్యతను అంతర్జాతీయ టూర్ కోఆర్డినేటర్గా నియమించిన సందర్భంగా రాపర్ల మురళీ కృష్ణకు హృదయపూర్వక ఆర్థిక శుభాకాంక్షలు తెలియజేసిన రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి. ఇకనుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే విదేశీ పర్యటనలకు గాను ఈయన కోఆర్డినేటర్ గా పని చేస్తారు. గతంలో ఈయన చేసిన సేవలకు గాను కూటమి ప్రభుత్వం గుర్తించి ఈ అంతర్జాతీయ టూర్ కోఆర్డినేటర్ గా నియమించినట్లు తెలిపారు. కోఆర్డినేటర్ లో భాగంగా విదేశీ పర్యటనలు ప్రవాసాంధుల సమావేశాలు మరియు అంతర్జాతీయ ప్రతినిధుల ఈవెంట్స్ సమన్వయం చేయడం తదితర బాధ్యతలు చేపట్టనున్నారని తెలియజేశారు. అంతర్జాతీయ సమావేసాలు ప్లాన్ చేయడం వేదికలు లాజిస్టిక్ మరియు ప్రోటోకాల్ కల్పించడం స్థానిక విదేశీ ఏపీ ఎన్ ఆర్ టి ఎస్ కోఆర్డినేటర్ తో సమన్వయం చేసుకోవడం పలు కీలక బాధ్యతలు నిర్వహిస్తారు. అంతర్జాతీయ సమావేశంలో ఎజెండాలు సిద్ధం చేయడం ప్రతినిధులు మరియు ప్రవాసాంధ్రుల మధ్య చర్చలు సులభతరం చేయడం విదేశీ భారతీయ సంఘాలు మరియు కమ్యూనిటీ నాయకులను ఏకీకృతం చేయడం.పర్యటన అనంతరం సుదీర్ఘ సంబంధాలు మెరుగుపరచడంలో ఈయన యొక్క సేవలు ఉంటాయన్నారు. అంతర్జాతీయ కోఆర్డినేటర్ ద్వారా ప్రవాసాంధ్రుల సంక్షేమం మరియు రాష్ట్ర అభివృద్ధి పెట్టుబడులు విదేశీ తెలుగు వారి భాగస్వామ్యం పెంచడంలో కీలక పాత్ర వహించి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడుతారని అన్నారు. ఇంతటి బాధ్యత గల పదవిని దక్కించుకున్న మురళీకృష్ణ కు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధసారథి తెలియజేశారు.

# వార్తాప్రభ కథనానికి స్పందించిన సర్కిల్-49 టౌన్ ప్లానింగ్ అధికారులు

● సుదర్శన్‌నగర్ కాలనీలోని అక్రమ షెడ్‌కు సీజ్

● అక్రమ నిర్మాణాలపై చర్యలు కొనసాగుతాయని అధికారుల స్పష్టీకరణ



**శేరిలింగంపల్లి,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** శేరిలింగంపల్లి జోనల్ పరిధిలోని సుదర్శన్ నగర్ కాలనీలో నిర్మిస్తున్న షెడ్ విషయంలో వార్తాప్రభలో ప్రచురితమైన కథనానికి సీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించారు.నిర్మాణాన్ని పరిశీలించిన అధికారులు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అక్బర్, చైన్‌మన్ మోహన్ ఆధ్వర్యంలో నోటీసులు జారీ చేసి సీజ్ చర్యలు చేపట్టారు.అనంతరం పోలీసుల బందోబస్తు మధ్య షెడ్‌కు సీజ్ నోటీసు అంటించి నిర్మాణ పనులను నిలిపివేశారు. అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా చేపట్టే నిర్మాణాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.వార్తాప్రభ కథనానికి స్పందించి వెంటనే చర్యలు తీసుకున్న సీఎంసీ అధికారులను స్థానికులు అభినందించారు. సుదర్శన్ నగర్ కాలనీతో పాటు శేరిలింగంపల్లి పరిధిలోని ఇతర అక్రమ నిర్మాణాలపైనా ఇదే తరహా చర్యలు కొనసాగించాలని స్థానికులు కోరుతున్నారు.

# కూటమి ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యం

ఎంపీ కేశినేని శివనాథ్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన టిడిపి మైనార్టీ నేతలు





**ఇబ్రహీంపట్నం,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** కూటమి ప్రభుత్వంలో మైనార్టీలకు అత్యంత ప్రాధాన్యం లభిస్తుందని, మైనార్టీల సంక్షేమానికి ఎంపీ కేసినేని శివనాథ్ (చిన్ని) చేసిన కృషి ఎంతో అభినందనీయమని తెలిపారు టిడిపి నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు హైదర్.పార్లమెంట్ సమావేశాల్లో ముస్లిం మైనారిటీల అభ్యున్నతి కోసం రూ.101.88 కోట్ల అంచనా వ్యయంతో 7 ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం చొరవతో కేంద్ర ప్రభుత్వ పరిశీలనకు తీసుకెళ్లిన పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) కృతజ్ఞతలు తెలియజేస్తూ టిడిపి నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు హైదర్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కొండపల్లి టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జంపాల సీతారామయ్య, ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాలాభిషేకం అనంతరం మదర్సా పిల్లలతో ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కో- ఆప్షన్ సభ్యులు మహబూబ్ సుభాని, కార్మిక నాయకులు షరీఫ్,పార్టీ పట్టణ అధ్యక్షులు కరిమికొండ బాలాజీ,మండల పార్టీ అధ్యక్షులు జీలాని స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# గేదెల దొంగతనాల కేసులో నలుగురు నిందితులు అరెస్ట్

**జి.కొండూరు,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** జి.కొండూరు పోలీసులు గేదెల దొంగతనాల కేసులను ఛేదించి నలుగురు నిందితులను శుక్రవారం అరెస్టు చేసి గేదలను స్వాధీనం చేసుకున్నారు.జి.కొండూరు పోలీస్ స్టేషన్, మైలవరం సర్కిల్, ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల జరిగిన గేదెల దొంగతనాల కేసులు నమోదయ్యాయి. పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు, ఐపీఎస్ ఆదేశాల మేరకు, డీసీపీ (రూరల్) లక్ష్మీనారాయణ, ఐపీఎస్ పర్యవేక్షణలో, మైలవరం ఏసీపీ పి.రామచంద్రరావు సూచనల తో, మైలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.కిషోర్ బాబు పర్యవేక్షణలో జి.కొండూరు పోలీస్ స్టేషన్ ఎస్.ఐ. కె. సతీష్ కుమార్ తమ సిబ్బంది ప్రత్యేక నిఘా పెట్టి నిందితులను గుర్తించారు. **అరెస్ట్ చేసిన నిందితుల వివరాలు:** ఏ1 ముద్దాయి గా ఎన్టీఆర్ జిల్లా,జి కొండూరు మండలం వెల్లటూరు గ్రామంలో మధ్య మాలపల్లి (జీవన్ నగర్) కి చెందిన కొండా తరుణ్ అలియాస్ తంబి రాజు(21),ఏ2ముద్దాయిగా ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండలం, వెల్లటూరు గ్రామానికి చెందిన మూల కుమార్ బాబు అలియాస్ తేరేజ్ (26), ఏ3 ముద్దాయిగా వెల్లటూరు గ్రామం(జీవన్ నగర్)కే చెందిన నిమ్మగడ్డ మహేష్ అలియాస్ బాలయ్య(27), ఏ 4 ముద్దాయిగా జి కొండూరు మండలం వెల్లటూరు గ్రామం జీవన్ నగర్ కి చెందిన కొండా అనీల్ (26) ఉన్నారని, వీరు జి.కొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గేదెల దొంగతనాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయిందని వీరిపై జి.కొండూరు పోలీస్ స్టేషన్ కేసులు నమోదు అయ్యాయని కె.ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపారు. గేదెల దొంగతనాలు లేదా ఇతర నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ ఐ హెచ్చరించారు. పశువుల యజమానులు తమ గేదలను రాత్రి వేళల్లో సురక్షితమైన ప్రదేశాలలో కట్టివేసి, నిర్లక్ష్యంగా వదిలివేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అలాగే, తమ గ్రామాల్లో లేదా పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు జి.కొండూరు పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని తెలిపారు.గేదెల దొంగతనాల కేసులను త్వరితగతిన ఛేదించి నిందితులను అరెస్టు చేసి, దొంగిలించబడిన గేదలను స్వాధీనం చేసిన ఎస్.ఐ కె.సతీష్ కుమార్ ని మరియు ఈ కేసు దర్యాప్తులో పాల్గొన్న జి.కొండూరు పోలీస్ స్టేషన్ పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# హ్యాండ్ బుక్ తయారీపై శిక్షణ



**సంగం,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** సంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో డిస్ట్రిక్ట్ సెన్సస్ హ్యాండ్‌బుక్ తయారీపై ఏ ఎస్ ఓ ప్రసాద్ ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం లో తహసీల్దార్ సారంగపాణి పాల్గొని ఎన్యూమరేటర్లకు అవగాహన కల్పించారు .ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జనగణనలో భాగంగా ప్రతి రెవెన్యూ గ్రామానికి సంబంధించిన డిస్ట్రిక్ట్ సెన్సస్ హ్యాండ్‌బుక్‌ను డిజిటల్ విధానంలో రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏ ఎస్ ఓ మీడియా తో మాట్లాడుతూ గ్రామ సరిహద్దులు, జనాభా వివరాలతో పాటు విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, విద్యుత్ తదితర అన్ని మౌలిక సదుపాయాల సమాచారాన్ని ఈ హ్యాండ్‌బుక్‌లో నమోదు చేయనున్నట్లు వివరించారు. గ్రామాలపై పూర్తి అవగాహన ఉన్న విలేజ్ రెవెన్యూ ఆఫీసర్లు , పంచాయతీ కార్యదర్శులను ఎన్యూమరేటర్లుగా ఎంపిక చేసి శిక్షణ అందించినట్లు తెలిపారు. ఈ నెల 17వ తేదీ నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో సమాచార సేకరణ చేపట్టి, డిజిటల్ రూపంలో నమోదు చేయనున్నట్లు చెప్పారు.గ్రామాల వారీగా సేకరించిన సమాచారాన్ని మండల స్థాయిలో సమీకరించి, అనంతరం జిల్లా సెన్సస్ అధికారులకు పంపించడం ద్వారా పూర్తి స్థాయి డిస్ట్రిక్ట్ సెన్సస్ హ్యాండ్‌బుక్ సిద్ధమవుతుందని తెలిపారు. డిజిటల్ విధానంలో ప్రక్రియ నిర్వహించడం వల్ల రోజువారీగా నమోదు చేసిన సమాచారం తక్షణమే అందుబాటులో ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

# తిరుపతమ్మ అమ్మవారి ఆలయం వద్దకు ఉన్న ప్రధాన రహదారిపై ఆక్రమణలు తొలగించండి

--మండల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పిజిఆర్ఎస్ లో కలెక్టర్ డాక్టర్ లక్ష్మీ షా కు వినతి



**పెనుగంచిప్రోలు, ఆగష్టు 7 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామంలోని ఆర్కే ఫంక్షన్ హాల్ లో శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో పి జి ఆర్ ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మండల ప్రెస్ క్లబ్ సభ్యులు మాదల శ్రీనివాసరావు, బత్తుల వెంకటరామయ్య, బోళ్ల రవికుమార్,పులికొండ సాంబశివరావు యానమండల నాగేశ్వరరావు, కాకాని రవి, బూర యశ్వంత్, దండా రామకృష్ణ, మద్దాల రామకృష్ణ తదితరుల ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ సెంటర్ వద్ద నుండి తిరుపతమ్మ అమ్మవారి ఆలయం వద్దకు వెళ్లేందుకు ప్రధాన రహదారి మొత్తం ఆక్రమణలకు గురి కావడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, అలాగే పోలీస్ స్టేషన్ సెంటర్ వద్ద ఆర్టీసీ బస్సుల కోసం ఎదురుచూసే ప్రయాణికులకు పబ్లిక్ టాయిలెట్స్ లేక మహిళలు వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురవుతు న్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి అధికారులకు తగు సూచనలు చేస్తానని తెలిపారు.

# కొమ్మారెడ్డి స్కూల్ లో గ్రీన్ డే మరియు ఆషాడమాస సెలెబ్రేషన్స్



**కృత్తివెన్ను,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** బంటుమిల్లి కొమ్మారెడ్డి గ్రీన్ డే మరియు ఆషాడమాస సెలెబ్రేషన్స్ ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ కేజీ, యూకేజీ విద్యార్థిని విద్యార్థులు ఆకుపచ్చ రంగు దుస్తులలో వినూత్న వస్త్రధారణతో స్కూల్ కు వచ్చారు. ఆకుపచ్చ రంగు బెలూన్లతో తరగతి గదులను అలంకరించడం జరిగింది. విద్యార్థులు నిర్వహించిన ఆకుపచ్చ రంగులో లభించే వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆట వస్తువులు, ఆకుపచ్చ రంగులో లభించే వివిధ రకాల ఆహార పదార్థాల ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రకృతిలో మనకు లభించే బెండ లాంటి కాయగూరలు, తోటకూర, గోంగూర లాంటి ఆకుకూరలు వాటి వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. ఆషాడమాస సెలెబ్రేషన్స్ లో భాగంగా 1 వ తరగతి విద్యార్థిని, విద్యార్థులుతమ చిట్టి చేతులకు గోరింటాకు అలంకరించుకుని స్కూల్ కు హాజరయ్యారు. ఆషాడమాసంలో చేసే తాటిగారెలు వంటి వివిధ పిండి వంటలు, ఈ మాసంలో లభించే నేరేడు వంటి పండ్లను ప్రదర్శించి, వీటి వల్ల మన ఆరోగ్యానికి కలిగే లాభాలను వివరించారు. ఈ ఆషాడమాసంలో గోరింటాకు పెట్టుకోవడం మన సంప్రదాయమని, ఇటువంటి సంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం ప్రీ- ప్రైమరీ ఇంచార్జ్ పి. వెంకట లక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో కొమ్మారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ కొమ్మారెడ్డి చైతన్య , వైస్ ప్రిన్సిపాల్ కొమ్మారెడ్డి హరణి , స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎన్.శ్రీనివాసరావు , ఎల్ కే జి, యూకేజి, 1 వ తరగతి ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# టిడిపి నేత గొరిపర్తి వేణుగోపాల కృష్ణ మృతి

●సంతాపం తెలిపిన పలువురు ప్రముఖులు.





**మోపిదేవి/అవనిగడ్డ,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** మోపిదేవి మండలం, వెంకటాపురం గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ నాయకులు గొరిపర్తి వేణుగోపాల కృష్ణ మృతి చెందారు.అనారోగ్యంతో చికిత్స పొందుతూ విజయవాడ లోని ఓ ఆసుపత్రిలో వేణు శుక్రవారం తుదిశ్వాస విడిచారు.పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ ,పార్టీ పటిష్టతకు , ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రజలకు తోడుగా నిలిచి నాయకత్వ పటిమను చూపిన వేణుగోపాల కృష్ణ పార్టీలోనూ ,ప్రజాబాహుళ్యంలోను గుర్తింపు పొందారు. సీనియర్ నాయకునిగా ప్రజాసమస్యలకు కృషి చేస్తూనే , పార్టీ నిర్మాణానికి నిబద్ధతతో పనిచేశారు.వేణు మృతి సమాచారం తెలియగానే పార్టీ శ్రేణులు విక్కుర్తి రాంబాబు ,కొల్లి మురళి ,రావి నాగేశ్వరరావు తదితరులు ఆయన స్వగృహం వద్ద ఉన్న వేణు మృతదేహాన్ని సందర్శించి పార్టీ జెండా కప్పి, పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.మాజీ సర్పంచ్ రావి వెంకటేశ్వరరావు, గ్రామ ప్రముఖులు ఉప్పాల శ్రీనివాసరావు, పరంధామయ్య,పి.వెంకటేశ్వరరావు తదితరులు ఘననివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు.

# మండల్ కమిషన్ సిఫార్సులను పూర్తిగా అమలు చేయాలి: బీసీ సంఘర్షణ సమితి

-సమన్వయకర్త సేవ్వా అశోక్ సామ్రాట్ యాదవ్



**తిరుపతి,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** ఓబీసీ రిజర్వేషన్లకు పునాది వేసిన మండల్ కమిషన్ నివేదిక సమర్పించిన రోజు సందర్భంగా గురువారం తిరుపతిలోని డీబీఆర్ రోడ్డులో ఉన్న బీపీ మండల్ విగ్రహానికి బీసీ సంఘర్షణ సమితి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన "మండల్ డే" కార్యక్రమంలో బీసీ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం సాధనకు మండల్ కమిషన్ చేసిన సేవలను నాయకులు స్మరించుకున్నారు.ఈ సందర్భంగా బీసీ సంఘర్షణ సమితి సమన్వయకర్త సేవ్వా అశోక్ సామ్రాట్ యాదవ్ మాట్లాడుతూ, బీపీ మండల్ సూచించిన మండల్ కమిషన్ సిఫార్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి జాప్యం లేకుండా పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి మండల్ కమిషన్ నివేదిక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు.అదేవిధంగా పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో బీసీలకు తగిన రిజర్వేషన్లు కల్పించాలని, మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు ప్రత్యేక సబ్‌కోటా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాలను కోరారు. బీసీల జనాభాకు అనుగుణంగా రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.మండల్ కమిషన్ ఆశయాలను అమలు చేయడం ద్వారానే సామాజిక సమానత్వం, న్యాయం సాధ్యమవుతుందని పేర్కొంటూ, బీసీల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని బీసీ సంఘర్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, బీసీ సంఘర్షణ సమితి నాయకులు లక్ష్మయ్య, దంపూర్ భాస్కర్ ,అన్న అనిత యాదవ్, నక్క భాస్కర్ యాదవ్ పలువురు బీసీ సంఘాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమాచార భవన్ కార్యాలయంలో ఘనంగా బోనాల ఉత్సవాలు



**హైదరాబాద్,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో మాసబ్ ట్యాంక్‌లోని సమాచార భవన్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సమాచార శాఖ ఉద్యోగుల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఉత్సవ ఊరేగింపు, బోనాల సమర్పణ, ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుంద్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన ఉత్సవ ఊరేగింపులో డప్పు వాయిద్యాలు, పోతరాజుల విన్యాసాలు, సాంప్రదాయ కళారూపాల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సమాచార శాఖ సంచాలకులు ఎల్.ఎల్.ఆర్. కిషోర్ బాబు, అదనపు సంచాలకులు డి.ఎస్. జగన్, మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, జాయింట్ డైరెక్టర్లు డి. శ్రీనివాస్, కె. వెంకటరమణ, సి.ఐ.ఈ. రాధాకిషన్, డిప్యూటీ డైరెక్టర్లు సి. రాజారెడ్డి, ఆర్.ఐ.ఈ. జయ రామ్మూర్తి, సహాయ సంచాలకులు సత్యనారాయణ రెడ్డి, బిమల్ దేవ్, డిప్యూటీ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ నర్సింహా గౌడ్, అకౌంట్స్ ఆఫీసర్లు పద్మ, టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, టీజీఓ అధ్యక్షుడు యేలూరి శ్రీనివాసరావు, టీఎన్‌జీవోస్ నాయకులు అనిల్, జితేందర్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నూజివీడు క్రీడాకారుల అద్భుత ప్రతిభకు పలువురి అభినందన





**నూజివీడు,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** నూజివీడుకు చెందిన క్రీడాకారులు అమరావతి ఛాంపియన్షిప్ ఏలూరు జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ పోటీలలో అత్యద్భుతమైన ప్రతిభ కనపరిచి అందరి అభినందనలు పొందినట్లు సీనియర్ కోచ్, పీడీ వాకా నాగరాజు తెలిపారు. నూజివీడులో ఆయన శుక్రవారం సాయంత్రం మాట్లాడుతూ అండర్ 23 విభాగంలో బాలురు, అండర్ 17 విభాగంలో బాలురు మరియు బాలికల జట్లు ఏలూరు జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచినట్లు తెలిపారు.అండర్ 23 బాలికలు ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. నూజివీడు నుండి పాల్గొన్న అండర్ 23 విభాగంలోని ఎనిమిది మంది బాలురు, బాలికలు ముగ్గురు, అండర్ 17 విభాగంలో 8 మంది బాలురు, ఎనిమిది మంది బాలికలు, మొత్తం నూజివీడు నుండి 27 మంది బాలబాలికల క్రీడాకారులు బాస్కెట్ బాల్ పోటీలలో జిల్లాస్థాయి లో ఎంపిక కావడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. విజేతలను పలువురు అభినందించారు.

# ఇందిరమ్మ ఇళ్లలో అగ్రవర్ణ పేదలకు (ఈబీసీ) అన్యాయం

- ఈబీసీ సంక్షేమ సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి



**హైదరాబాద్,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అగ్రవర్ణ పేదలకు అన్యాయం జరుగుతోందని ఈబీసీ సంక్షేమ సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు అగ్రవర్ణ పేదలు (ఈబీసీ) కూడా అర్హులేనని, వారికి కూడా సమాన అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది అగ్రవర్ణ పేద కుటుంబాలు నివాస గృహాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, వారికి ఇంద్రమ్మ ఇళ్ల కేటాయింపులో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అగ్రవర్ణ పేదలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఇంద్రమ్మ ఇళ్ల పంపిణీలో ఈబీసీ వర్గానికి తగిన వాటా కల్పించాలని ఈబీసీ సంక్షేమ సంఘం విజ్ఞప్తి చేసింది.

# మైనార్టీ పక్షపాతి కూటమి ప్రభుత్వం



**గొల్లపూడి,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** సూఫీ సేవా సదన్ కార్యాలయంలో ముస్లిం మైనారిటీ మత పెద్దలతో కలిసి విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేసినేని శివనాద్( చిన్ని) చిత్రపటానికి పాలాభిషేకం చెసి ప్లే కార్డుల ప్రదర్శించారు. సూఫీ సేవా సదన్ నిర్వాహకులు రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి,సూఫీ సేవా సదన్ ట్రస్ట్ రాష్ట్ర చైర్మన్ షేక్ మొహమ్మద్ ఫైజాన్ ఆధ్వర్యంలో ముస్లిం మైనారిటీతో జరిగిన కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు. విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) పార్లమెంట్ సమావేశాల్లో ముస్లిం మైనారిటీల అభ్యున్నతి కోసం రూ.101.88 కోట్ల అంచనా వ్యయంతో 7 ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం చొరవతో కేంద్ర ప్రభుత్వ పరిశీలనకు తీసుకెళ్లిన శుభసందర్భంగా, ఎంపీ కి కృతజ్ఞతలు తెలియజేసేందు ముస్లిం మైనారిటీ లకు ప్రాతినిథ్యం దక్కిందని అన్నారు.

# ముగిసిన చివరి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం



**విస్సన్నపేట,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** స్థానిక మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ గద్దల మల్లయ్య అధ్యక్షతన చివరి మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పలు అంశాలపై చర్చించారు. వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, మండల తాసిల్దార్ కే లక్ష్మి కళ్యాణి, ఇన్చార్జ్ ఎంపీడీవో ప్రసాద్ డిప్యూటీ ఎంపీడీవో రామమోహన్ పలు శాఖల అధికారులు ఎంపీటీసీలు ఓలేటి దుర్గారావు, పీఎం వనజాక్షి రాజేష్( మాజీ ఎంపీపీ), ఎం సత్యనారాయణ చారి, డి పాపా, షేక్ రజియా, కో ఆప్షన్ నెంబర్ జాఫర్ బాబా తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు చేనేత కార్మిక దంపతులను సత్కరించిన ఉప్పాల రాము హారిక



**పెడన,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** జాతీయ చేనేత కార్మికుల దినోత్సవ సందర్భంగా ఇద్దరు చేనేత కార్మిక దంపతులను వైసీపీ తరపున శుక్రవారం నాడు సత్కరించారు. సాగునీటి కోసం రిలే దీక్ష చేస్తున్న శిబిరం వద్ద వీరిని శాలువా తో సత్కరించి నూతన వస్త్రాలను జడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక వైసీపీ నియోజకవర్గం ఇంచార్జ రాము అందజేశారు.

# వై ఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసిన మైలా రత్నకుమారి



**పెడన,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం లో సాగునీటి కోసం ఉప్పాల రాము ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళ కార్యక్రమాలను మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డికి పెడన నియోజకవర్గం కృత్తివెన్ను జడ్పిటిసి మైలా రత్నకుమారి వివరించారు. శుక్రవారం నాడు గన్నవరం ఎయిర్ పోర్ట్ కు చేరుకున్న జగన్మోహన్ రెడ్డిని రత్నకుమారి కలుసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించి నట్టు రత్నకుమారి వార్తప్రభ ప్రతినిధికి పెడనలో జరిగిన రిలే దీక్షలో పాల్గొనడానికి వచ్చిన ఆమె తెలిపారు

# ఆయిల్ ఫామ్ సాగుతో అధిక లాభాలు

- జిల్లా ఉద్యాన శాఖ అధికారి బాలాజీ కుమార్
- వెల్లటూరు గ్రామ శివారు సీతారాంపురంలో "మెగా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ డ్రైవ్"





**జి.కొండూరు,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** ఆయిల్ ఫామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని, రైతులు ఆయిల్ పామ్ సాగు చేసేందుకు మరింత ముందుకు రావాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి బాలాజీ కుమార్ అన్నారు తెలిపారు.శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా జి కొండూరు మండలం వెల్లటూరు గ్రామ శివారు సీతారాంపురంలోని మండవ వెంకట సాయి కావ్య అనే రైతు కు చెందిన 12 ఎకరాలలోని వ్యవసాయ క్షేత్రంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆయిల్ ఫామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో ఏపి ఎంఐపి పిడి దశరథ రామిరెడ్డి, పతాంజలి ఫుడ్స్ డిజిఎం వీరేంద్ర చౌదరి లతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బాలాజీ కుమార్ ఎన్టీఆర్ జిల్లాలో ఆయిల్ ఫామ్ ప్రోత్సాహకాల గురించి వివరించారు.రైతులు తమ వ్యవసాయ పొలాల్లో వరితోపాటు, పంట మార్పిడి విధానంలో కూరగాయలు, పండ్ల తోటల పెంపకం చేపట్టాలన్నారు.ఎకరా ఆయిల్ ఫామ్ సాగుకు రూ.50 వేల వరకు మొక్కలు, డ్రిప్పు, పాండ్ నిర్వహణకు వివిధ రకాలుగా ప్రభుత్వం సబ్సిడి ఇస్తోందన్నారు.మూడేళ్లపాటు ఆయిల్ ఫామ్ సాగు చేస్తే నాలుగో ఏడాది నుంచి ఆదాయం వస్తుందన్నారు.రైతులందరూ ఆయిల్ ఫామ్ సాగుపై మరింత దృష్టి సారించాలన్నారు. సూక్ష్మ సేద్య పరికరాలు (డ్రిప్ ఇరిగేషన్), ప్రాముఖ్యత సబ్సిడీలు గురించి పిడి దశరథ రామిరెడ్డి వివరించారు.ఆయిల్ ఫామ్ యొక్క ఉపయోగాలు వాటి ప్రాముఖ్యత గురించి వీరేంద్ర చౌదరి వివరించారు.ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జ్ ఉద్యాన శాఖ అధికారి పరమేశ్వర రెడ్డి, ఆయిల్ ఫామ్ మేనేజర్ జి. సత్య శరత్,స్థానిక ఉద్యాన శాఖ సిబ్బంది, మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి రైతులు పాల్గొన్నారు.

# పోక్సో చట్టం, రోడ్డు భద్రత, సైబర్ నేరాల నివారణ, డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం




**రెడ్డిగూడెం,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఎన్టీఆర్ రూరల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ లక్ష్మీనారాయణ, ఐపీఎస్ సూచనలతో, మైలవరం ఇన్చార్జి ఏసీపీ రామచంద్రరావు ఆధ్వర్యంలో రెడ్డిగూడెం మండలం మద్దులపర్వలోని ఏపీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో పోక్సో చట్టం, రోడ్డు భద్రత, సైబర్ నేరాల నివారణ మరియు డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా మైలవరం ఇన్చార్జి ఏసీపీ రామచంద్రరావు మాట్లాడుతూ, విద్యార్థులు స్కూల్ లేదా కళాశాలకు వెళ్లే సమయంలో బస్సులు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు, రోడ్లు దాటేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్డు దాటే ముందు తప్పనిసరిగా ఇరువైపులా చూసి, వాహనాల రాకపోకలను గమనించిన తర్వాతే దాటాలని తెలిపారు. అకస్మాత్తుగా పరుగెత్తుకుంటూ రోడ్డు దాటడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని వివరించారు. అలాగే విద్యార్థులు డ్రగ్స్ అనే మహమ్మారికి పూర్తిగా దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా ప్రభావానికి లోనుకాకుండా విద్యపై పూర్తి ఏకాగ్రతతో ముందుకు సాగి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. మైలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. కిషోర్ బాబు మాట్లాడుతూ, విద్యార్థులు అవసరం లేనప్పుడు ఇన్స్టాగ్రామ్, ఫేస్‌బుక్, స్నాప్‌చాట్ వంటి సోషల్ మీడియా వేదికలకు దూరంగా ఉండాలని, మొబైల్ ఫోన్‌ను విద్యాభ్యాసం మరియు అవసరమైన పనులకే పరిమితం చేయాలని సూచించారు. స్కూల్ లేదా కాలేజీకి వెళ్లే సమయంలో బస్సులు, ఆటోల కోసం రోడ్లపై వేచి ఉండేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, రోడ్లపై ఆటలు ఆడకూడదని తెలిపారు. పోక్సో చట్టంపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా బాలికల పట్ల గౌరవంగా, బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని సూచించారు. చట్టవిరుద్ధమైన లేదా నిర్లక్ష్యపూరిత చర్యలు విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపడంతో పాటు జీవితాంతం కోలుకోలేని నష్టానికి దారితీసే అవకాశం ఉందని వివరించారు. రెడ్డిగూడెం సబ్ ఇన్స్పెక్టర్ ఎస్. శ్రీను మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ, సైబర్ నేరాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జీవితంలో మంచి లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించేందుకు పట్టుదలతో కృషి చేసి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు, విద్యార్థులు వెంటనే పోలీస్ ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ -- 112కు కాల్ చేయాలని అధికారులు సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ -- 1930కు ఫిర్యాదు చేయడంతో పాటు సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు. అదేవిధంగా డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసినా, డ్రగ్స్ విక్రయం లేదా వినియోగంపై అనుమానం వచ్చినా ఈగల్ (EAGLE) డ్రగ్స్ హెల్ప్‌లైన్ -- 1972కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమాజంలో మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాల నివారణ, రోడ్డు ప్రమాదాల నివారణ మరియు ప్రజల భద్రత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మైలవరం ఇన్చార్జి ఏసీపీ రామచంద్రరావు , మైలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. కిషోర్ బాబు , రెడ్డిగూడెం సబ్ ఇన్స్పెక్టర్ ఎస్. శ్రీను , ఏపీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి..

- కృష్ణా విశ్వవిద్యాలయంలో అవగాహన సదస్సు.
- వ్యసనాల నిర్మూలనకు విద్యార్థులు భాగస్వాములు కావాలి.
- ఉజ్వల భవిష్యత్తుపై దృష్టి సారించాలని వక్తల పిలుపు.




**మచిలీపట్నం,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** కృష్ణా విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ "మాదకద్రవ్య రహిత యువత -- వికసిత భారత్" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణా జిల్లా కార్యదర్శి, సివిల్ న్యాయమూర్తి ఎస్. వరలక్ష్మి మాట్లాడుతూ మాదకద్రవ్యాల మహమ్మారిని సమాజం నుంచి తరిమికొట్టేందుకు యువత ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. మచిలీపట్నం ఉప పోలీసు అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణకు పోలీసులు విస్తృత చర్యలు చేపడుతున్నారని, వాటి నిర్మూలనలో విద్యార్థుల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. పట్టణ పోలీసు అధికారి ఏసుబాబు మాట్లాడుతూ మాదకద్రవ్యాల బారిన పడి జీవితాలను కోల్పోతున్న యువత, వారి కుటుంబాల బాధను నిత్యం ప్రత్యక్షంగా చూస్తున్నామని, ఆ పరిస్థితి రాకుండా ప్రతి విద్యార్థి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మై భారత్ కార్యక్రమా నికి చెందిన ఎన్టీఆర్ జిల్లా యువజన అధికారి బి. ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ వికసిత భారత్ లక్ష్య సాధనలో భాగంగా దేశవ్యాప్తంగా పక్కా ప్రణాళికతో మాదకద్రవ్యాల నిర్మూలన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం భారీ స్థాయిలో నిధులు కేటాయించి అమలు చేస్తోందని చెప్పారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కె. రాంజీ మాట్లాడుతూ యువత ఎలాంటి వ్యసనాలకు దూరంగా ఉండి విద్య, నైపుణ్యాలపై దృష్టి సారించి ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ ఎం. శ్రావణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది సి.హెచ్. ముసలయ్య, కళలు--విజ్ఞాన కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం. కోటేశ్వరరావు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఆర్. కిరణ్ కుమార్, జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు పని చేయించి..80 లక్షలకు టోపీ

- రోడ్డెక్కిన గిరిజనులు
- మంత్రి కొల్లు అనుచరుడిపై ఆరోపణ
- న్యాయం కోసం పాదయాత్ర
- లంబాడీలు వినూత్న నిరసన
- ఇబ్రహీంపట్నంలో ట్రాఫిక్ జామ్



**ఇబ్రహీంపట్నం, ఆగష్టు 7 (వార్తాప్రభ) :** ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర అనుచరుడు రాజా తమతో పనులు చేయించుకుని డబ్బులు చెల్లించకుండా మోసం చేశాడని ఆరోపిస్తూ జి.కొండూరు మండలం కట్టుబడిపాలెం గ్రామ బంజారా గిరిజనులు శుక్రవారం ఇబ్రహీంపట్నం నుంచి విజయవాడ కనకదుర్గ గుడికి పాదయాత్ర చేపట్టారు. మంత్రి కొల్లు రవీంద్ర జోక్యం చేసుకుని తమకు న్యాయం జరిగేలా చూడాలని నినాదాలు చేశారు. పాదయాత్రలో దుర్గమ్మ ఫొటో, సారె ప్రదర్శించారు. సంప్రదాయ లంబాడీ దుస్తుల్లో ప్ల కార్డులు చేతపట్టి మంత్రి కొల్లు అనుచరుడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.మంత్రి అనుచరుడు రాజా తమతో కాంట్రాక్టు పనులు చేయించుకుని సుమారు రూ.80 లక్షలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాడని ఆరోపించారు. డబ్బులు చెల్లించమని అడిగితే తాను మంత్రి కొల్లు అనుచరుడినని, డబ్బులు ఇవ్వను.. ఏం చేసుకుంటారో.. చేసుకోండి అని బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల పాదయాత్రకు సీపీఎం మండల కార్యదర్శి ఎం.మహేష్ సంఘీభావం తెలిపారు.

# సముద్ర మత్స్యకారులకు ఎల్‌నినో జాగ్రత్తలు అవసరం...



**గుడ్లవల్లేరు,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** సముద్ర కోస్తా మత్స్యకారులు ఎల్‌నినో ప్రభావంపై కొన్ని జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉంది. జిల్లాలో సుమారుగా 38వేల మంది ప్రత్యక్షంగా చేపల వేటకు వెళ్లే సముద్ర మత్స్యకారులు ఉన్నారు. సముద్ర మత్స్యకారులకు జిల్లా మత్స్య శాఖాధికారి ఎ.నాగరాజ ఇస్తున్న సలహాలు, సూచనలు ఇలా ఉన్నాయి.

**అసలు ఎల్‌నినో అంటే ఏమిటి...** ప్రపంచ వాతావరణ పరిస్థితుల్లో అసాధారణమైన మార్పులు సంభవించడం వలన రాబోవు సంవత్సర కాలంలో సకాలంలో వానలు రాక వర్షాభావ పరిస్థితులు ఏర్పడవచ్చు. లేదా కొన్ని సందర్భాలలో అధిక వర్షపాతం పడవచ్చు. దీనిని సమర్థంగా ఎదుర్కోవడానికి మత్స్యకారులు సన్నద్ధతతో ఉండాలి.

**ఎల్‌నినో వలన కలిగే నష్టాలివి...** సముద్రపు నీటి ఉష్ణోగ్రత విపరీతంగా పెరిగిపోతుంది. కవ్వళ్ళు(సార్డైన్స్), కానగర్తలు(మాకరెల్) వంటి చేపలు వేడిని తట్టుకోలేక వలస వెళ్లిపోయి...తగ్గుముఖం పడతాయి. మత్స్యకారులకు పట్టుబడి తగ్గే అవకాశం ఉంటుంది. సముద్రంలో చేపలకు ఆహారంగా ఉండే ప్లవకాలు (ఆహారపు గొలుసు తొలి మెట్టు) తగ్గిపోతాయి. తద్వారా నీటికి అమ్లత్వం పెరిగి పగడపు దిబ్బలు తగ్గుతాయి, షెల్ ఫిష్ గుల్ల గట్టి పడకుండా మెత్తగా ఉంటుంది. అలల తీరు, గాలుల మార్పు వల్ల వాతావరణం అనిశ్చితంగా మారి సముద్రం అల్లకల్లోలంగా ఉంటుంది. వేడిని తప్పించుకోవడానికి చేపలు లోతైన సముద్రానికి తరలి వెళ్ళిపోతాయి. నీటి రంగు మారి హానికరమైన శైలలాలు(ఆల్గే) వ్యాపించే ప్రమాదం ఉంది. గుడ్లు పెట్టే సామర్థ్యం దెబ్బ తిని చేపల సంతతి తగ్గుతుంది, తద్వారా చేపల ఉత్పత్తి తగ్గిపోతుంది.

**ఈ జాగ్రత్తలు అవసరం...** ప్రతి రోజు చేపల లభ్యత సూచనలను పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వాతావరణ బులెటిన్లను తరచుగా చూడాలి. సముద్రం అల్లకల్లోలంగా ఉంటే... వేటకు వెళ్ళే ముందు జాగ్రత్త వహించాలి. మత్స్య రేవులో అందుబాటులో ఉంచే చేపల లభ్యత సమాచార బోర్డులను వాడుకోవాలి. ట్రాన్స్‌పాండర్‌ను ఎల్లప్పుడు ఆన్‌లో ఉంచుకోవాలి. లైఫ్ సేవింగ్ పరికరాలను ఎల్లప్పుడూ బోటులో ఉంచుకోవాలి. జారీ చేసే చేపల లభ్యత సమాచారాన్ని అనుసరించి సముద్రంలో ఆ దిశగానే చేపల పట్టుబడి చేయాలి.

**వేట పద్ధతిలో మార్పులివి...** కత్రిమ దిబ్బలు(ఆర్టిఫిషియల్ రీఫ్లు) ఏర్పాటు చేయడం వల్ల చేపలకు ఆశ్రయం పునరుత్పత్తికి అవకాశం లభిస్తుంది. ప్రాదేశిక జలాల్లో చేపలు తగ్గినప్పుడు ఇతర రకాల చేపల వేట కోసం లోతైన సముద్రానికి వెళ్లాలి. అందుకు కావలసిన శిక్షణ డిపార్ట్‌మెంట్ ద్వారా పొందాలి. వాతావరణాన్ని తట్టుకునే తీర గ్రామాల అభివద్ధి సౌకర్యాలను వినియోగించుకోవాలి.

**జీవనోపాధికి ఆర్థిక సహాయం ఇలా...** సముద్రపు నాచు(సివీడ్) పెంపకం విలువ ఆధారిత ఉత్పత్తులు, పంజరాల్లో చేపలు పెంపకం వంటి ప్రత్యామ్నాయాలు ఆదాయ వనరులను వినియోగించుకోవాలి. పోర్టల్‌లో నమోదు చేసుకుని ప్రభుత్వ పథకాలను పొందాలి. బోటుకు బీమా ఉందో లేదో సరిచూసుకోవాలి. నష్టం జరిగితే వెంటనే అధికారులకు తెలియజేసి పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవాలి. మత్స్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో 24/7 ఎల్‌నినో సేవలను మత్స్యశాఖ అందిస్తుంది. ఆ సేవలను మత్స్యకారులు వినియోగించుకోవాలి.

# శ్రీ కొండలమ్మ అన్నదాన ప్రారంభోత్సవానికి అపూర్వ స్పందన...



**గుడ్లవల్లేరు,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** మండలం వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం ఆలయ చరిత్రలో తొలిసారిగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని గుడివాడ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చేకూరి జగన్మోహనరావు దంపతుల చేతుల మీదుగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు, దాతల నుంచి అపూర్వ స్పందన లభించింది. ప్రతి శుక్రవారం జరిగే ఈ అన్నదాన కార్యక్రమానికి మూడు నెలల వరకు దాతలు తమ ఆర్థికసాయాన్ని చేసి అమ్మవారి పట్ల తమకున్న భక్తిని చాటుకున్నారు. దేవాదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ అన్నసమారాధన కార్యక్రమానికి వేలాది భక్తులు విచ్చేసి అమ్మవారి అన్న ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో చైర్మన్ ఈడే మోహన్, ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తలు, ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవి, మండల టీడీపీ అధ్యక్షులు పోలవరపు వెంకట్రావు, జనసేన జిల్లా కార్యదర్శి పేర్ని జగన్, పీఏసీఎస్ చైర్మన్ అట్లూరి రామచంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# చెట్లు నరికారు కొమ్మలు మరిచారు

**విస్సన్నపేట,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో గత శనివారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రహదారులు పక్కన ఉన్న చెట్లు కొమ్మలను విద్యుత్ అంతరాయం కలగకుండా నరికి వేయడం జరిగింది. ఇది ప్రజా ఉపయోగ కార్యక్రమం అయిన నరికి వేసిన కొమ్మలను బ్యాంకులు కమర్షియల్ కాంప్లెక్స్ లు ఎదుటి నుండి తొలగించకపోవడం తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు



# గుడివాడ వైశ్య సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా మంత్రి టీజీ భరత్ పుట్టినరోజు వేడుకలు



**గుడివాడ,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో మంత్రి టీజీ భరత్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక బంటుమిల్లి రోడ్డులో ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గోకవరపు సునీల్, మరియు గుడివాడ వైశ్య సంఘాల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో నాయకులు, యువత పాల్గొన్నారు. ముందుగా పుట్టిన రోజు కేక్ కట్ చేసిన నాయకులు.. హ్యాపీ బర్త్ డే భరత్" అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రద్దీగా ఉండే బంటుమిల్లి రోడ్డులో కార్మికులకు, వాహనదారులకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం గోకవరపు సునీల్ మాట్లాడుతూ.. "మంత్రి టీజీ భరత్ వైశ్య సామాజిక వర్గానికి దక్కిన గొప్ప నాయకుడన్నారు. యువతకు ఉపాధి, వ్యాపార అవకాశాలు కల్పించడంలో ఆయన పాత్ర కీలకమన్నారు. పదిమందికి మంచి చేసే భరత్ భవిష్యత్తులో మరిన్ని పదవులు అలంకరించాలని, దీర్ఘాయుష్షుతో ప్రజాసేవ చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. వైశ్య సంఘాలన్నీ ఐక్యంగా ఆయనకు అండగా ఉంటామని" తెలిపారు. పుట్టినరోజు వేడుకల్లో గుడివాడ వైశ్య సంఘం అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు, తాడిపర్తి సురేష్, ఆర్యవైశ్య కళ్యాణమందిర అధ్యక్షులు పోకూరి మోహనరావు, సంఘ నాయకులు తుంపూడి సాంబశివరావు, బెజవాడ బాజేశ్వరరావు, కూరెళ్ళ శ్యామ్, సముద్రాల జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

## 10న పి.ఎం నేషనల్ అప్రెంటిస్ షిప్ మేళా

**గుడివాడ,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ షిప్ మేళా 10-08-2026 తేదీన కే. బి. ఆర్ గవర్నమెంట్ ఐటిఐ గుడివాడ నందు ఉదయం 10 గంటలకు జరుగును. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై అభ్యర్థులను అప్రెంటిస్ గా చేర్చుకోవడం జరుగుతుంది. కావున ఐటిఐ పాస్ అయ్యి అప్రెంటిస్ పూర్తికాని అభ్యర్థులు అన్ని ట్రేడులవారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో హాజరు కావలసి ఉంది. ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసిందిగా కోరుచున్నాము. అభ్యర్థులు ఈ క్రింది లింకు ద్వారా https://www.apprenticeshipindia.gov.in/mela-registration రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు అని ప్రిన్సిపల్ / కన్వీనర్ ఓ. మంజులాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. సందేహాలను నివృత్తి కోసం 08674-295953 నెంబర్లను సంప్రదించవచ్చు అని తెలియజేశారు.

## చిత్తలూరు-2 లో తల్లిపాలు వారోత్సవాలు



**చేజర్ల,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** మండలంలోని చిత్తలూరు టు అంగన్వాడి కేంద్రం నందు తల్లిపాలు వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గర్భవతులు బాలింతలు పిల్లల తల్లులను హాజరు పరిచి వాళ్లకి తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం జరిగింది.బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు ఇవ్వాలని తెలిపారు.ఈ పాలలో వ్యాధి నిరోధక శక్తిని పెంచే పదార్థం ఉంటుందని బిడ్డను వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చని తల్లిపాలు చాలా స్వచ్ఛమైన శ్రేష్టమైన పాలు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## యూపీహెచ్‌సీలో క్షయవ్యాధి అవగాహన, టీబీ స్క్రీనింగ్ కార్యక్రమం విజయవంతం..




**కూకట్‌పల్లి,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** ఆల్విన్ కాలనీ సర్కిల్ వెంకటేశ్వర్ నగర్ డివిజన్ హనుమాన్ నగర్ లోని యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో క్షయవ్యాధి (టీబీ)పై అవగాహన కల్పించడంతో పాటు టీబీ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌ఓ) డా. ఆనంద్, కూకట్‌పల్లి జోనల్ డీఎంహెచ్‌ఓ డా. జ్యోతి సందర్శించారు. ఈ సందర్భంగా వారు కార్యక్రమ నిర్వహణను పరిశీలించి, వైద్య సిబ్బందితో మాట్లాడి చేపట్టిన ఏర్పాట్లను అభినందించారు. అలాగే క్షయవ్యాధి కేసులను ప్రారంభ దశలోనే గుర్తించడం, స్క్రీనింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించడం, రోగులకు నిరంతర చికిత్స అందేలా పర్యవేక్షణ కొనసాగించడం వంటి అంశాలపై విలువైన సూచనలు చేశారు. ప్రజలకు టీబీపై అవగాహన కల్పించడంతో పాటు స్క్రీనింగ్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో వారు తమ వంతు సహకారం అందించారు. అధికారుల సందర్శన, వారి ప్రోత్సాహం, మార్గదర్శకత్వం కార్యక్రమ విజయానికి ఎంతో దోహదపడిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. ప్రేమవృత, ఎన్‌టీఈపీ సిబ్బంది, ఐదుగురు ఎన్‌సీసీ క్యాడెట్లు, యూపీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎంపీ, కాపు సంఘం నేత ముద్రగడ పద్మనాభం ఇటీవల మృతిచెందగా.. ఆయన కుమార్తె, జనసేన నాయకురాలు (క్రాంతి) రాజమండ్రి లోని ఆమె స్వగృహంలో గుడివాడ జనసేన, కాపు సేవా సమితి నేతలు పరామర్శిస్తున్న దృశ్యం. ఈ కార్యక్రమంలో జనసేన గుడివాడ ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, కాపు సేవా సమితి నాయకులు సంకర గాంధీ, ఎం సత్యనారాయణ, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.
-గుడివాడ,ఆగష్టు 7 (వార్తాప్రభ) :

# శాకంబరీ దేవిగా అమ్మవారు.. భక్తుల కోలాహలం

### శ్రీ గౌరీ శంకర స్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు..





**గుడివాడ,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** ఆషాఢ మాసం చివరి శుక్రవారం సందర్భంగా గుడివాడలోని పలు ఆలయాల్లో అమ్మవారిని శాకంబరీ దేవిగా వైభవంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందారు. స్థానిక శ్రీ గౌరీ శంకర స్వామి వారి దేవస్థానంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో సుందరంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారి దీవెనలతో ఆషాడమాస ఉత్సవాలు ఎంతో వైభవంగా జరిగినట్లు వేద పండితులు తెలిపారు. లోక కళ్యాణార్థం ప్రజలందరూ పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ శాకంబరీ వేడుకలు నిర్వహించినట్లు చెప్పారు. వేడుకల్లో వేద పండితులు, ఆలయాల ధర్మకర్తల కమిటీ సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**శాకంబరి దేవి అలంకరణలో దర్శనమిచ్చిన శ్రీ విజయ దుర్గ అమ్మవారు.. :** స్థానిక నీలామహల్ రోడ్లో వేంచేసి ఉన్న శ్రీ విజయ దుర్గ అమ్మవారి దేవస్థానంలో ఆషాడ మాస శుభ సందర్భంగా నేడు అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించడం జరిగింది. అలంకరణ నిమిత్తం భక్తులు వారి శక్తి కొలది కూరగాయలు పండ్లు ఇచ్చినారు. వారి యొక్క సహాయ సహకారాలతో ఈరోజు కార్యక్రమం ను దిగ్విజయంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం ప్రతి ఏటా ప్రజల సహకారంతో మరియు దేవదాయ ధర్మాదయ శాఖ కార్య నిర్వాహకుల ఆధ్వర్యంలో ఎంతో వైభవోపితంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈరోజు అమ్మవారిని రకరకాల కూరగాయలతో ,పండ్లతో అమ్మవారు అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల చైర్మన్ బోడబళ్ల వెంకట హరిబాబు, ఆలయ పూజారి పునీత్ శర్మ, దేవాదాయ ధర్మకర్తల మండలి సభ్యులు దేవాది మహాలక్ష్మి, కోడూరు ప్రభు, ఏసుబాబు, బొంగు శ్రీదేవి ఆలయ ఈవో గంగు శిరీష తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నోటు పుస్తకాలు, నగదు ప్రోత్సాహకాలు పంపిణీ



**గుడివాడ,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** శుక్రవారం శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో పర్వతనేని జగన్మోహన్ రావు జయంతి సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియం మాజీ జాయింట్ సెక్రెటరీ పర్వతనేని ఆనంద్ సహకారంతో స్థానిక నీలామాల్ రోడ్ లోని మునిసిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్ (అల్లం బడి) నందు చిన్నారి విద్యార్థిని విద్యార్థులకు నోటు పుస్తకములు స్టేషనరీ వితరణగా ఇచ్చారు. అలాగే చెరుకూరి రమేష్ స్కూల్లో ఉత్తీర్ణత శాతం లో మొదట వచ్చిన వారికి 5గురు చిన్నారి విద్యార్థిని విద్యార్థులకు 2500/- (ఒక్కో విద్యార్థికి 500/- రూపాయలు) వితరణగా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మున్సిపల్ మాజీ ప్రతిపక్ష నేత లింగం ప్రసాద్ విచ్చేసి విద్యార్థులకు పుస్తకాలు, నగదు బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని, విద్య కోసం ఎంత ఖర్చు అయినా ప్రభుత్వం భరిస్తుందన్నారు. కావున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో పావని ప్రసాద్, నవభారత్ ఖాదీ స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్, దుక్కిపాటి రవి భూషణ్, లంకపల్లి లాజరు, కోడూరు ప్రభు, దేవాది నాగేశ్వరరావు, బొగ్గరపు తిరుపతయ్య, హరిబాబు, పుట్టి వెంకటేశ్వరావు, జాజుల తాతారావు, స్కూల్ హెచ్ఎం నాగ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఉద్యోగుల మెగా వైద్య శిబిరానికి విశేషస్పందన



**గుడివాడ,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** దైనందిని జీవితంలో ప్రభుత్వ ఉద్యోగులు నిరంతరం మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని అటువంటి పరిస్థితుల్లో వారికి ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసి మెగా వైద్య పరీక్షలను నిర్వహిస్తున్న శ్రీ వివేకానంద సేవా సమితి, వివేకానంద వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ పేర్కొన్నారు శుక్రవారం పురపాలక సంఘ కార్యాలయంలో శ్రీకాంత్ క్లినిక్ వ్యవస్థాపకులు ప్రముఖ వైద్యులు డాక్టర్ వల్లూరుపల్లి సుబ్రహ్మణ్యేశ్వరరారావు, కార్తీక్ హార్ట్ సెంటర్ సహకారంతో ఏర్పాటుచేసిన ఈ మెగా వైద్య శిబిరంలో ఖరీదైన వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున పురపాలక సంఘ సిబ్బంది సచివాలయ సిబ్బంది స్థానిక ప్రజలు వైద్య సేవలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, శ్రీ స్వామి వివేకానంద సేవా సమితి అధ్యక్షులు సింగవరపు ప్రభాకర్, వ్యవస్థాపక అధ్యక్షులు ఉరిటి రామారావు, వాకర్స్ క్లబ్ అధ్యక్షులు కొలుసు శివకుమార్ కార్యదర్శి పులివర్తి ఉమా నాగేశ్వరరావు జాయింట్ సెక్రెటరీ పల్లపు అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు గుడివాక తాతేశ్వరరావు కార్యవర్గ సభ్యులు దేసు వెంకట సత్యనారాయణ నవభారత్ కాదు స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్ భీమేశ్వరాలయ కమిటీ చైర్మన్ పట్టపు సత్యనారాయణ గుడివాడ వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షులు క్లబ్ పూర్వాధ్యక్షులు డివి సత్యనారాయణ జిల్లా ఎన్జీవో నాయకులు షేక్ ఫరీద్ భాష, టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు లంకపల్లి లాజర్ వాసవి క్లబ్ జిల్లా నాయకులు గాదె మోహన్ బాబు మున్సిపల్ ఆర్వో మట్ట రాజా, సీనియర్ పాత్రికేయులు బండారు రాధాకృష్ణ, వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీపై రెండో రోజు కొనసాగుతున్న వైఎస్ఆర్ సీపీ నిరాహార దీక్షలు

- గుడివాడ రూరల్ నాయకులు, విద్యార్థి యువజన విభాగాల యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని మద్దతు..




**గుడివాడ,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** డీఎస్సీ ప్రక్రియలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ కోరుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు రెండవ రోజు కూడా కొనసాగాయి. గుడివాడ రూరల్ నాయకులు నిర్వహించిన ఈ దీక్షా శిబిరాన్ని పట్టణ అధ్యక్షులు గొర్ల శ్రీను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, విద్యార్థి, యువజన విభాగాల నాయకులు మరియు యువకులు పెద్ద సంఖ్యలో హాజరై తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన అభ్యర్థులను పక్కనపెట్టి, అనర్హులకు ఉద్యోగాలు కట్టబెట్టడం ద్వారా ప్రతిభావంతులైన నిరుద్యోగ యువత గొంతు కోశారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ సంబంధిత మంత్రి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం తన ప్రజా వ్యతిరేక విధానాలను మార్చుకోకపోతే వైఎస్ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో, కొడాలి నాని ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని పార్టీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంవి నారాయణరెడ్డి, ఎంపీపీ గద్దె పుష్పరాణి, ఎంపీపీ పెయ్యల ఆదాము, వైస్ ఎంపీపీ బట్టు నాగమల్లేశ్వరి, మట్ట జాన్‌విక్టర్, అడపా పండు, కందుల నాగరాజు, లోయ రాజేష్, గంట సురేష్, కందవల్లి రవి, గంటా శీను, అడబాల అప్పారావు, ఆలీ బెగ్, రమణకుమార్, ఏ కృష్ణమోహన్, కొంకితల ఆంజనేయ ప్రసాద్, వేంపల అప్పారావు, రేమల్లి నీలకాంత్, తుళ్ళిమిల్లి ఏష కెయ్య, ఎస్ కే బాజీ, కె వి ఎస్ ప్రసాద్, చింతా నాని, క్రేన్ బాబి, కర్రె నాని, జర్మియా, ధనియాలపేట భాష, ఎస్ రాంబాబు, ఏలేటి ఆంజనేయులు, బోయిన సోమశేఖర్, సాంబశివుడు, మసిముక్కు ఈశ్వర్, గౌరిపర్తి సుబ్రహ్మణ్యేశ్వరరావ్, రెడ్డి దుర్గాప్రసాద్, బండి మహేష్, కల్లేపల్లి పవన్, బట్టు కృష్ణ, నిలపాల విష్ణు, కుణాల కిరణ్, అంగడాల శివకుమార్, పల్లపోతు జ్యోతి బాబు, శీలం ప్రకాష్, జుమాల కోటయ్య, జోషి, గోళ్ళ రాకేష్, మాదాసు వెంకటలక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

# 10న జరిగే జైలు భరోను విజయవంతం చేయాలి




**గుడివాడ,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 10న జైల్ భరో నిర్వహించనున్నట్లు పారిశ్రామిక క్లస్టర్ జిల్లా కార్యదర్శి బేత శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక సుందరయ్య భవనం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బేత శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఈరోజు అమెరికాతో వాణిజ్య ఒప్పందని రద్దు చేయాలని ఆ ఒప్పందాలు అమలు అయితే భారతదేశంలో వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతీస్తుందని వ్యవసాయ రంగంతో పాటు పాడి పరిశ్రమ, కోళ్ల పరిశ్రమలు కూడా దెబ్బతినే పరిస్థితి ఉంటుంది కాబట్టి అమెరికాను వాణిజ్య ఒప్పందాన్ని తక్షణ రద్దు చేయాలని ప్రధానమైన డిమాండ్ రెండోది కష్టానికి తగ్గ ఫలితం రావట్లేదని కార్మిక వర్గం దేశవ్యాప్తంగా నిరసనలు చేస్తామన్నారు కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి వాళ్లకి రక్షణ కల్పించాలని అన్ని పంటలకు గిట్టుబాటు ధరలో చట్టం చేయాలని మన రాష్ట్రానికి సంబంధించి ఆర్టీసీ, విద్యుత్,మున్సిపాలిటీ ప్రైవేటీకరణ చేసే విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని వీటికి వ్యతిరేకంగా ఆగస్టు 10వ తారీఖు జరిగే జైలు బరో కార్యక్రమంలో రైతులు ప్రజలు కార్మిక ఉద్యోగ ఉపాధ్యాయ విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా విజ్ఞప్తి చేసారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు ఆర్ సి పి రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం, ఐద్వా జిల్లా నాయకురాలు పి.రజిని, రైతు నాయకులు శ్రీనివాసరావు, భవన నిర్మాణ కార్మిక జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.కొండ తదితరులు పాల్గొన్నారు.

# మండల్ డే ఘనంగా నిర్వహించిన బీసీ సంక్షేమ సంఘం



**మచిలీపట్నం,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** మండల్ డే సందర్భంగా శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం కృష్ణా జిల్లా కార్యాలయం, ఈడేపల్లిలో సంఘ నాయకులు ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ బిందేశ్వర్ ప్రసాద్ మండల్ అని కొనియాడారు. జమిందారీ కుటుంబంలో జన్మించిన మండల్, బీహార్ ఏడో ముఖ్యమంత్రిగా పదవికి రాజీనామా చేసి దేశవ్యాప్తంగా పర్యటిస్తూ బీసీల సామాజిక, ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేశారని గుర్తు చేశారు. పర్యటన అనంతరం కేంద్ర ప్రభుత్వానికి బీసీల సంక్షేమం కోసం 40 సిఫార్సులు సమర్పించారని, వాటిలో భాగంగా 1990 ఆగస్టు 7న అప్పటి ప్రధాని వీ.పీ. సింగ్ రెండు కీలక సిఫార్సులను పార్లమెంట్‌లో అమలు చేశారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఇతర వెనుకబడిన వర్గాలకు (ఓబీసీ) 27 శాతం రిజర్వేషన్ కల్పించడం మండల్ కమిషన్ సిఫార్సుల ఫలితమేనని, ప్రతి బీసీ ఈ చారిత్రక విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. మండల్ కమిషన్ సిఫార్సుల వల్ల బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు, పాలనలో ప్రాతినిధ్యం లభించాయని పేర్కొన్నారు. ఇంకా అమలుకు నోచుకోని మిగిలిన సిఫార్సులను కూడా కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా మండల్ డే నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జోగి శివ, నిక్కు రాధాకృష్ణ, కొండేటి మోహన్, బోగిరెడ్డి సుభాని, బెల్లంకొండ రవి, జన్ను నాంచారయ్య, బోడావుల ప్రసాద్, బొమ్మనబోయిన నాగరాజు, బోయిన రమేష్ తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

# 250 మంది విద్యార్థులకు జడ్జి చేతుల మీదుగా యూనిఫారలు పంపిణీ.



**మచిలీపట్నం,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ సేవా కార్యక్రమాలలో 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం మచిలీపట్నం లేడి యాంప్తుల్ ప్రభుత్వ బాలికల కళాశాలలో 250 మందికి లక్ష రూపాయలు ఖరీదు చేసే ఉచిత యూనిఫార్మ్ లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లంకిశెట్టి ఫ్రెండ్ సర్కిల్ కన్వీనర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ కృష్ణాజిల్లాలో గల ఏకైక మహిళ బాలికల కళాశాలలో గత 20 సంవత్సరాల నుండి తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ముఖ్యంగా తల్లి తండ్రి లేని విద్యార్థినిలకు సింగిల్ పేరెంటు ఉన్న విద్యార్థులకు ప్రాముఖ్యత ఇస్తూ సహాయ కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలియజేశారు. సుదూర ప్రాంతంలో ఉన్న తమ సంస్థ సభ్యులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములు అయ్యారని బాలాజీ తెలియజేశారు. అగ్ని ప్రమాద బాధితులకు, ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు తగిన ప్రోత్సాహం ఇవ్వడంలో లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ ముందుంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి. లక్ష్మి 15 డివిజన్ మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ న్యాయవాది లంకిశెట్టి సాయి ఫణి సంతోష్, కొల్లు జ్ఞాన సాయి, కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ హరినాథ్ బాబు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు

## ఆదురుపల్లిలో బ్లడ్ క్యాంప్ నిర్వహణ



**చేజర్ల,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** చేజర్ల మండలంలోని ఆదూరుపల్లి గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి తరఫున శుక్రవారం ఆర్గనైజర్ ఆత్మకూరు శశికళ ఆధ్వర్యంలో ఈ బ్లడ్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ బ్లడ్ క్యాంప్ యొక్క ముఖ్య ఉద్దేశం పిల్లలలో తలసేమియా గురించి కార్యక్రమం నిర్వహించడం జరిగినదని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో కామంచి వెంగబాబు వంశీ బ్లడ్ క్యాంప్ నిర్వాహక సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్లు రహదారులు సరిలేక అబ్బాయిలకు పెళ్లిళ్లు కావడం లేదు

### ఎంపీటీసీ కొంకిణి సత్యనారాయణ చారి ఆవేదన



**విస్సన్నపేట,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని ఎంపీటీసీ కొంకిణి సత్యనారాయణ చారి తమ గ్రామానికి రోడ్లు రహదారులు మౌలిక వసతులు లేకపోవడంతో తమ పిల్లలకు పెళ్లి సంబంధాలు కూడా రావడం లేదని తన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కన్న తండ్రి తమ కుమార్తె మెట్టిన ఇంటికి వెళ్ళిన తర్వాత సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకోవడం జరుగుతుందని అలాంటిది సరి అయిన రోడ్లే లేని తమ ఊరికి సంబంధాలు ఎవరు కలుపుకోవడం లేదన్నారు.

## పెరికిడు ప్రాథమిక పాఠశాలకు మానవతా సేవా చేయూత

- రూ.7,500 విలువైన బీరువా, రెండు సీలింగ్ ఫ్యాన్లు బహూకరణ



**హనుమాన్ జంక్షన్,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** సామాజిక సేవలో భాగంగా మానవతా హనుమాన్ జంక్షన్ సంస్థ ఆధ్వర్యంలో బాపులపాడు మండలం పెరికిడు ప్రాథమిక పాఠశాలకు రూ. 7,500 విలువైన బీరువాతో పాటు రెండు సీలింగ్ ఫ్యాన్లను శుక్రవారం అందజేశారు. బీరువాను కొట్నాని కేశవరావు అందించగా, రెండు సీలింగ్ ఫ్యాన్లను కొట్నాని రామచంద్రరావు విరాళంగా అందించారు. పాఠశాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ సహాయాన్ని అందించడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మానవతా రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, అధ్యక్షురాలు ఇందిరాదేవి, కార్యదర్శి గణేష్‌బాబు, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, కన్వీనర్ సత్యనారాయణ, డైరెక్టర్లు రామచంద్రరావు, చలం, సుబ్బారావు, సుబ్బాచారి, రాజేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రావు, శ్రీధర్, గ్రామ పెద్దలు శర్మగారు, బాబుగారు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి సహకరించిన మానవతా హనుమాన్ జంక్షన్ సభ్యులకు పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## కొండలమ్మ అన్నదానానికి రూ.25వేల వితరణ...



**గుడ్లవల్లేరు,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం నుంచి జరుగనున్న అన్నసమారాధనకు గానూ ఆలయ ధర్మకర్త మన్నెం వీర నాగేంద్రం రూ. 25,116ల చెక్కును బహూకరించారు. ఈ చెక్కును గుడివాడ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చేకూరి జగన్మోహనరావు దంపతులు, చైర్మన్ ఈడేవెంకట విష్ణు మోహనరావు, ఈఓ ఆకుల కొండలరావుకు అందించారు.

# యర్రమాద వెంకన్న నేత ఉద్యమ ఫలితమే చేనేత దినోత్సవం






**మచిలీపట్నం,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** చేనేత కళాకారుల ఆత్మగౌరవం, సాంప్రదాయ చేనేత కళా పరిరక్షణ కోసం, చేనేత కార్మికుల ఆర్థికాభివృద్ధి కోసం ఒక రోజు ఉండాలని అకుంఠిత దీక్షతో ఎన్నో ఉద్యమాలు చేశారు హైదరాబాద్ కు చెందిన యర్రమాద వెంకన్న నేత. 2006 నుంచి అలుపెరగని సంకల్పంతో ఆయన చేసిన ఉద్యమం ఫలితంగా 2017లో భారత ప్రభుత్వం ఆగష్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించింది. చెన్నై వేదికగా జరిగిన తొలి జాతీయ దినోత్సవ ఆవిర్భావ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ము-ఖ్యఅతిథిగా విచ్చేయగా యర్రమాద వెంకన్న కూడా పాల్గొన్నారు. నాటి సభలో మోదీ ప్రసంగం చారిత్రాత్మకం. చేనేత పట్ల ఆయనకు ఉన్న అభిమానం, అవగాహన అమోఘం. నాటి ఆయన ప్రసంగం వల్ల చేనేత కళాకారుల వృత్తి నైపుణ్యం పట్ల గౌరవం పెరిగింది. నాటి నుండి ప్రతి సంవత్సరం ఆగస్టు 7న ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో జాతీయ చేనేత దినోత్సవాన్ని నేతన్నలు అత్యంత ఘనంగా జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జాతీయ చేనేత దినోత్సవ వ్యవస్థాపకునిగా యర్రమాద వెంకన్న హైదరాబాదులోని కంట్రీ క్లబ్ లో జాతీయ చేనేత దినోత్సవ సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో చేనేత అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఎందరో మహానుభావులు పాల్గొని ప్రసంగించారు. చేనేత ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని, నేతన్నల కళాత్మక ఉత్పత్తుల శ్రమ చుక్కల కష్టాన్ని వివరించి, ఇంతటి గొప్ప 'కళ'ను ప్రపంచస్థాయిలో విస్తృతం చేయాలని, అందుకు ప్రభుత్వాలు సత్సంకల్పంతో ముందుకు రావాలని కోరారు. ఆ సమావేశంలో యర్రమాద వెంకన్న మాట్లాడుతూ దేశంలో 67 శాతం మంది చేనేత కళాకారులు 5వేల రూపాయల ఆదాయాన్ని మాత్రమే పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ చేనేత ఉత్పత్తి 80 శాతం పైగా భారతదేశం నుండి అందుతుందని అన్నారు. దేశంలో 28 లక్షల చేతి మగ్గాలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా కోటి మందికి పైగా ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అటువంటి రంగాన్ని ప్రోత్సహించవలసిన ప్రభుత్వాలు చేనేతకు చెందిన పలు పథకాలను రద్దుచేసి నేతన్నలకు తీరని అన్యాయం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో 200 కోట్లు కేటాయించింది. చేనేత రంగాన్ని ప్రత్యేకంగా ప్రోత్సహించవలసిన కేంద్ర ప్రభుత్వం టెక్స్టైల్స్ తో సమానంగా జీఎస్టీ విధించి చేనేత చేతి పరిశ్రమను నిర్వీర్యం చేసిందన్నారు. మిల్లులో తయారైన వస్త్రాలను చేనేత వస్త్రాలుగా అమ్మి నేతన్నలకు తీరని ద్రోహం తలపెడుతున్నా కేంద్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, పలుమార్లు కేంద్రం దృష్టికి తీసుకొచ్చిన ఫలితం లేకపోయిందని, ఇలా చేయడం దారుణమని మాదన్న అన్నారు. చేనేత ఉద్యమకారురాలు, ప్రముఖ సినీ నటి పూనమ్ కౌర్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో చేనేతను నిలబెట్టడానికి కేంద్రం చిత్తశుద్ధితో ముందుకు రావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కళాత్మకమైన చేనేత గొప్పతనాన్ని మాటలతో కాకుండా అన్ని విధాల ఆదుకోవాలని అన్నారు. ఇప్పటికే చేనేత ఉత్పత్తులపై ప్రపంచ దేశాల్లో ఆదరణ పెరుగుతోందని దీన్ని అందిపుచ్చుకుని కేంద్రం తగిన విధంగా ప్రణాళికలతో ముందుకెళితే నేతన్నల బతుకుల్లో కాంతిరేఖలు వెల్లువెరుస్తాయని పూనమ్ కౌర్ అన్నారు. కంట్రీ క్లబ్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ తమ సంస్థలో పనిచేసే ఉద్యోగులందరూ కూడా చేనేతను ధరిస్తున్నారని అన్నారు. చేనేత కళాకారుల కోసం పనిచేస్తూనే ఉంటానని హామీ ఇచ్చారు. రచయిత్రి, చేనేత ప్రేమికురాలు అంజు పొద్దార్ మాట్లాడుతూ భారతీ-య చేనేత కళాకారుల కళ గొప్పదని అన్నారు. ఆంధ్ర, తెలంగాణ చేనేత కళాకారుల ఉత్పత్తులను తాను అమితంగా ప్రేమిస్తానని అన్నారు. విదేశాల్లో ఉన్న తన మనవరాలుకు చేనేత పట్ల మక్కువ ఎక్కువని చేనేత దుస్తులనే ధరిస్తుందని వివరించారు. యువతలో చేనేత పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సమావేశంలో చేనేత పెద్దలు చిలుకూరి బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకులు సి.ఎస్. రంగరాజన్, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం అంజయ్య, చింతకింది మల్లేశం, పల్లె సృజన చైర్మన్ బిగ్రేడియర్ పి గణేశం, క్రాఫ్ట్ కౌన్సిల్ పూర్వ చైర్పర్సన్ విజయలక్ష్మి, అభిహర సీఈవో సుధా ముల్లపూడి, కౌమది స్టూడియో వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ షర్మిల నాగరాజు, శ్రీశైలం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ చిలువేరు కాశీనాథ్ తో పాటు ఇంకా అనేక మంది ప్రముఖులు పాల్గొని చేనేత గొప్పతనాన్ని వివరించి, ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు.

## "వార్తా ప్రభ" కథనానికి స్పందన

### సీజ్ నోటీసులు జారీ చేసిన అధికారులు



**శేరిలింగంపల్లి,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** శేరిలింగంపల్లి జోనల్ పరిధిలోని సుదర్శన్ నగర్ కాలనీలో నిర్మిస్తున్న షెడ్ విషయంలో "వార్తాప్రభ"లో ప్రచురితమైన కథనానికి సీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించారు.నిర్మాణాన్ని పరిశీలించిన అధికారులు టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ అక్బర్, చైన్మన్ మోహన్ ఆధ్వర్యంలో నోటీసులు జారీ చేసి సీజ్ చర్యలు చేపట్టారు.అనంతరం పోలీసుల బందోబస్తు మధ్య షెడ్కు సీజ్ నోటీసు అంటించి నిర్మాణ పనులను నిలిపివేశారు. అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా చేపట్టే నిర్మాణాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.వార్తాప్రభ కథనానికి స్పందించి వెంటనే చర్యలు తీసుకున్న సీఎంసీ అధికారులను స్థానికులు అభినందించారు. సుదర్శన్ నగర్ కాలనీతో పాటు శేరిలింగంపల్లి పరిధిలోని ఇతర అక్రమ నిర్మాణాలపైనా ఇదే తరహా చర్యలు కొనసాగించాలని స్థానికులు కోరుతున్నారు.

## ట్రైకలర్ ప్రాపర్టీస్ లో శ్రావణమాసం ఆఫర్లు




**హైదరాబాద్,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** 2010లో స్థాపించబడిన ట్రైకలర్ ప్రాపర్టీస్ తెలంగాణలోని హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తూ వినియోగదారులకు నాణ్యమైన నివాస గృహాలను, ప్లాట్లను అందించారు. శుక్రవారం హైదరాబాద్ లోని సంస్థ కార్యాలయంలో ట్రై కలర్ ప్రాపర్టీస్ శ్రావణమాసపు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ఈ సందర్భంగా సంస్థ ఫౌండర్లు చందన్ కుమార్ జా, రంజన్ కుమార్ జా, దిగంభర్ జా మాట్లాడుతూ భారతదేశం అంతటా 20కి పైగా విజయవం తమైన రెసిడెన్షియల్ ప్రాజెక్టులతో ప్రీమియర్ రియల్ ఎస్టేట్ కంపెనీగా మెరుగైన సేవలను అందిస్తున్నామని తెలిపారు. ట్రైకలర్ ప్రాపర్టీస్ వద్ద, మేము విలాసవంతమైన జీవనం కోసం పర్యావరణ స్పృహతో సజావుగా ముడిపడి ఉన్న ప్రపంచానికి అంకితమైన దూరదృష్టి రియల్ ఎస్టేట్ సంస్థగా రూపొందిందని పేర్కొన్నారు. ప్రస్తుతం షాద్ నగర్ వద్ద సప్రాన్ రైజ్, శ్రీ శైలం హైవే వద్ద రైజింగ్ కోర్టు యార్డ్,ఆటం ఎక్సోటికా పేర్లతో వెంచర్లు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇతర వివరాలకు 99664 03349 ఫోన్ నెంబర్ లో సంప్రదించవచ్చు.

## తల్లిపాలు బిడ్డకు టీకాతో సమానం

- మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు
- ముగిసిన తల్లిపాల వారోత్సవాలు



**ఇబ్రహీంపట్నం, ఆగష్టు 7 (వార్తాప్రభ) :** తల్లిపాలు బిడ్డకు టీకాతో సమానమని, తప్పకుండా తల్లిపాలు పిల్లలకి ఇవ్వాలని సూచించారు కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ముగింపు సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సుస్థిరమైన ఆరంభానికి తల్లిపాలు ప్రతీక ఇప్పటికీ అమల్లో ఉన్న విధానాలను మరింత బలోపతం చేయటమే ఈ సంవత్సరం యొక్క ముఖ్య ఉద్దేశం తల్లిపాలు బిడ్డకి మొదటి టీకా లాగా పనిచేసే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు ఉద్యోగం చేసే తల్లి కూడా తల్లిపాలు ఎలా ఇవ్వాలో తల్లిపాలు ఇవ్వడం వలన బాలింతలకు బ్రెస్ట్ క్యాన్సర్ గర్భాశయ క్యాన్సర్ వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి పిల్లలకి డబ్బా పాలు పట్టే పట్టడం వలన ఖర్చుతో కూడుకున్న పని మళ్ళీ వాళ్ళకి స్వచ్ఛంగా ఎప్పుడెప్పుడు అనుకున్న టైంలో ఇవ్వలేక పోవడం కూడా పిల్లలకి తల్లికి చాలా ఇబ్బందికరమైన పరిస్థితి ఆర్థికపరంగా కూడా ఇబ్బందులు లేకుండా కుటుంబానికి ఉంటుంది తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లికి బిడ్డకి అనుబంధం ఏర్పడుతుంది మళ్లీ బిడ్డ బిడ్డకి ఎడం కూడా ఏర్పడుతుంది.ఈ కార్యక్రమంలో సిడిపిఓ పుష్పలత,వైస్ చైర్మన్ చుట్టుకూదురు శ్రీనివాస్ రావు, డాక్టర్ ప్రేమ్చంద్, టిడిపి నాయకులు అప్సర్, సూపర్వైజర్స్ మాధవి, శివకుమారి, అంగన్వాడి కార్యకర్తలు తల్లులు పాల్గొన్నారు.

## వారం రోజుల్లో విద్యార్థుల సమస్యకు పరిష్కారం..

## యార్లగడ్డ చొరవతో సెక్రెడ్ హార్ట్ పాఠశాల వద్ద ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్



**హనుమాన్ జంక్షన్,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు స్పందిస్తున్న ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మరోసారి విద్యార్థుల సమస్యను సత్వరమే పరిష్కరించారు. బాపులపాడు మండలం ఆరుగొలను గ్రామంలోని సెక్రెడ్ హార్ట్ పాఠశాల వద్ద ఆర్టీసీ రిక్వెస్ట్ బస్ స్టాప్ ఏర్పాటు చేయిస్తూ విద్యార్థులకు ఊరట కల్పించారు. గత నెల 31న ఆరుగొలను గ్రామంలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సునీత ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. పాఠశాల వద్ద బస్ స్టాప్ లేకపోవడంతో విద్యార్థులు ఆరుగొలను సెంటర్లో దిగి సుమారు కిలోమీటర్ నడిచి పాఠశాలకు చేరుకోవాల్సి వస్తోందని, రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆరుగొలను రూట్లో నడిచే ఏలూరు, నూజివీడు, గుడివాడ, మచిలీపట్నం ఆర్టీసీ డిపోల మేనేజర్లతో మాట్లాడి పాఠశాల వద్ద రిక్వెస్ట్ బస్ స్టాప్ ఏర్పాటు చేసి అన్ని ఆర్టీసీ బస్సులు అక్కడ ఆగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సంబంధిత ఆర్టీసీ డిపో మేనేజర్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 7వ తేదీ (శుక్రవారం) నుంచి ఆరుగొలను రూట్లో నడిచే అన్ని ఆర్టీసీ బస్సులు సెక్రెడ్ హార్ట్ పాఠశాల వద్ద ఆగి విద్యార్థులను ఎక్కించుకోవాలని డ్రైవర్లకు సూచనలు జారీ చేశారు. తమ సమస్యను కేవలం వారం రోజుల్లో పరిష్కరించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# సందడిగా బోనాల వేడుకలు!!

- సంస్కృతిని చాటిన చిన్నారులు
- సంప్రదాయ దుస్తుల్లో మెరిసిన విద్యార్థులు
- బోనాల విశిష్టతను వివరించిన కార్పొరేటర్





**పెద్దపల్లి/గోదావరిఖని,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని ప్రతిబింబించే బోనాల పండుగను శుక్రవారం గోదావరిఖని 4వ డివిజన్లోని స్పెక్ట్రా స్కూల్లో విద్యార్థులు ఉత్సాహంగా జరుపుకున్నారు. పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 4వ డివిజన్ కార్పొరేటర్ కంకణాల మౌనిక హాజరై విద్యార్థులతో కలిసి బోనాల వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. బోనాల పండుగ తెలంగాణ ప్రజల ఆచార వ్యవహారాలు, భక్తి భావన, సాంస్కృతిక ప్రత్యేకతలకు అద్దం పడుతుందని కార్పొరేటర్ తెలిపారు. ఆధునిక విద్యతో పాటు విద్యార్థులకు మన మూలాలు, సంప్రదాయాల గురించి తెలియజేయడం ఎంతో అవసరమని అన్నారు. చిన్నారులు చిన్ననాటి నుంచే పండుగల ప్రాధాన్యతను తెలుసుకోవడం ద్వారా సంస్కృతిపై మరింత అభిమానం పెంపొందుతుందని తెలిపారు. విద్యార్థులు చదువులో రాణించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేలా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. బోనాల వేడుకల్లో విద్యార్థుల ఉత్సాహం, సంప్రదాయ అలంకరణలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు బోనాల పండుగ విశిష్టతను వివరించారు. తల్లిదండ్రులు కూడా కార్యక్రమానికి హాజరై చిన్నారులను ప్రోత్సహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సాయిలీల ఆధ్వర్యంలో వేడుకలను చక్కగా నిర్వహించారు. విద్యార్థుల్లో సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు హర్షం వ్యక్తం చేశారు. బోనాల సంబరాలతో స్కూల్ ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అమ్మవార్ల కల్యాణ మహోత్సవం..

- పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్,మాజీ శాసనసభ్యులు కిచ్చన్న లక్ష్మారెడ్డి.



**జవహర్ నగర్, ఆగష్టు 7 (వార్తాప్రభ) :** మల్కాజ్గిరి కార్పొరేషన్ కీసర సర్కిల్ జవహర్నగర్ డివిజన్ పరిధిలోని భాగ్యనగర్--జై శ్రీరామ్ నగర్ కాలనీలో ఈరోజు శ్రీ కనకదుర్గ, శ్రీ రేణుక ఎల్లమ్మ, శ్రీ నల్లపోచమ్మ అమ్మవార్ల కల్యాణ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ శాసనసభ్యులు కిచ్చెన్న లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్ల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కల్యాణ మహోత్సవంలో జవహర్ నగర డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శాంతి కోటేష్ గౌడ్,చంద్రపురి కాలనీ డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, జిల్లా నాయకులు కల్లెపల్లి సదానందం, మాజీ కార్పొరేటర్లు, నాయకులు బల్లి శ్రీనివాస్, గజ్వేల్ శంకర్, కాలేశా, మరియు సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు,కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

- చేనేత కార్మికులకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందించాలి :-: మంత్రి సత్యనారాయణ పిలుపు




**కుత్బుల్లాపూర్, ఆగష్టు 7 (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ఉమ్మడి గాజులరామారం డివిజన్ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు సాయినాథ్ నేత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పద్మశాలి సేవా సంఘం ముఖ్య సలహాదారు, జీహెచ్ఎంసీ 129 సూరారం డివిజన్ మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకల్లో మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ మాట్లాడారు. చేనేత రంగం భారతీయ సంస్కృతి, పురాతన సంప్రదాయాలకు నిలువెత్తు ప్రతీక అని కొనియాడారు. రాత్రింబవళ్లు కష్టపడి వస్త్రాలను నేసే చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రభుత్వం తక్షణమే గుర్తించి వారికి తగిన న్యాయం చేయాలని కోరారు. కుటీర పరిశ్రమగా ఉన్న చేనేత రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉందని, ఆ రంగాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం మరిన్ని రాయితీలు, ప్రోత్సాహకాలు అందించాలని సూచించారు. చేనేత వస్త్రాల ప్రాశస్త్యాన్ని, వాటి గొప్పతనాన్ని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ప్రతి ఒక్కరూ వారంలో కనీసం ఒక్కరోజైనా చేనేత వస్త్రాలను ధరించడంతో పాటు, తరచుగా చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి చేనేత కార్మికుల జీవ-నోపాధికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో ఉమ్మడి గాజులరామారం పద్మశాలి సేవా సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ మచందర్, ప్రధాన కార్యదర్శి సారంగి అశోక్, ఉపాధ్యక్షులు బద్రి, ఆవిడపు సతీష్, కార్యదర్శులు మోకుల శంకర్, గోంటెల శ్రీనివాస్లతో పాటు కుల పెద్దలు ఆంజనేయులు, దామోదర్, ఈశ్వర్ ప్రసాద్, సాయి కిరణ్, దేవరపల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ దేవాలయ బోనాల ఉత్సవాలకు సదుపాయాలు కల్పించండి - జీహెచ్ఎంసీ అధికారులకు వినతి

- వీధి దీపాల ఏర్పాటు, కాలనీల్లో పారిశుధ్య పనులు చేపట్టి బోనాల ఊరేగింపునకు సహకరించాలని మనవి
- జీడిమెట్ల డిప్యూటీ కమిషనర్కు వినతిపత్రం అందజేసిన వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు




**జీడిమెట్ల,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ముత్యాలమ్మ దేవాలయంలో ఆదివారం నాడు నిర్వహించనున్న బోనాల పండుగ ఉత్సవాలను పురస్కరించుకుని కాలనీలలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని జీహెచ్ఎంసీ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. జీడిమెట్ల మునిసిపల్ డిప్యూటీ కమిషనర్ను మర్యాదపూర్వకంగా కలిసిన పలు కాలనీల సంక్షేమ సంఘాల (వెల్ఫేర్ అసోసియేషన్) ప్రతినిధులు బోనాల ఉత్సవాల నిర్వహణపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ.. బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి బోనాల ఊరేగింపు సాగే ప్రధాన మార్గాల్లో విద్యుత్ దీపాలు (లైట్లు) ఏర్పాటు చేయాలని, అలాగే కాలనీల వ్యాప్తంగా పేరుకుపోయిన చెత్తను తొలగించి పారిశుధ్య పనులను ముమ్మరం చేయాలని అధికారులను కోరారు. భక్తులకు, కాలనీవాసులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జీహెచ్ఎంసీ సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై డిప్యూటీ కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ తక్షణమే పారిశుధ్య, విద్యుత్ విభాగాల అధికారులను పురమాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కుంట సిద్దిరాములు, ఆర్థిక కార్యదర్శి చింతనూర్ రాజు, బచ్చు జ్ఞానేశ్వర్, వైష్ణవి కాలనీ ప్రెసిడెంట్ రంగు వెంకటేష్, శ్రీ రాఘవేంద్ర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణ, వైస్ ప్రెసిడెంట్ బి. సతీష్, ప్రధాన కార్యదర్శి ఉమాపతిరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బోనాలకు హనుమాన్ నగర్ పోచమ్మ ఆలయం ముస్తాబు..



**కూకట్పల్లి,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న బోనాల మహోత్సవాల్లో భాగంగా ఆషాఢ మాసం చివరి ఆదివారం జరిగే బోనాల వేడుకలకు ఆల్విన్ కాలనీ సర్కిల్,వెంకటేశ్వర్ నగర్ డివిజన్, హనుమాన్ నగర్లోని పోచమ్మ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. హనుమాన్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్ పర్యవేక్షణలో ఆలయ పరిసరాలను శుభ్రపరచడంతో పాటు ప్రత్యేక అలంకరణ పనులు చేపడుతున్నారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బోనాల సందర్భంగా పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు,బోనాల సమర్పణ,సాంప్రదాయ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

## స్కూల్ బస్సు బోల్తా.... విద్యార్థులకు గాయాలు



**ఇబ్రహీంపట్నం,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** హైదరాబాద్ -- విజయవాడ జాతీయ రహదారిపై మండల పరిధిలోని జూపూడి గ్రామం వద్ద శుక్రవారం సాయంత్రం ఓ పాఠశాల బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. పోలీసుల కథనం ప్రకారం కేతనకొండలోని శ్రీ స్వామి నారాయణ్ గురుకుల పాఠశాల బస్సు విద్యార్థులను ఎక్కించుకుని ఇబ్రహీంపట్నం వస్తోంది. మార్గమధ్యలో జూపూడి వద్ద అదుపు తప్పి బోల్తా పడింది ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. వెంటనే స్పందించిన స్థానికులు బస్సులో చిక్కుకున్న విద్యార్థులను సురక్షితంగా బయటకు తీశారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో విద్యార్థులు తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పాఠశాల బస్సుల నిర్వహణ, డ్రైవర్ల భద్రతా ప్రమాణాలు, వాహనాల ఫిట్ నెస్ పై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేశారు

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188